PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 121 | విజయవాడ, మంగళవారం 2 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 2 December 2025 | Rs

రికార్డుల రారాజు కోహ్లి

- అత్యధిక శతకాలతో టాప్‌లోకి
- సచిన్ టెండూల్కర్ రికార్డు బ్రేక్

8

స్థానికులు కూల్చివేసిన కామాక్షి ఇల్లు

పెంచలయ్య హత్యపై భగ్గుమన్న జనం

- గంజాయి గూండాల ఇళ్లు ధ్వంసం
- నెల్లూరు జిల్లా బంద్‌కు పలు పార్టీల మద్దతు

2



పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజు సోమవారం స్పీకర్ వెల్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపిలు

ఎస్ఐఆర్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

- చర్చకు ప్రతిపక్షాలు పట్టు
- రాజ్యసభలో వాకౌట్
- ఆందోళన మధ్యే మణిపూర్ జిఎస్‌టి బిల్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

శీతాకాల సమావేశాలను ఇంతకు ముందెన్నడూ లేని విధంగా కుదించిన కేంద్ర ప్రభుత్వం, తొలిరోజే పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించింది. తీవ్ర విమర్శలకు గురైన ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అత్యవసర చర్చ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించడం ద్వారా ప్రభుత్వం తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను తుంగలో తొక్కింది. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సహేతుకమైన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించాల్సిన కేంద్రప్రభుత్వం, ఉభయ సభల్లోనూ ధిక్కార వైఖరిని అవలంబించింది. ఫలితంగా లోక్‌సభ పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమవగానే, ఇటీవల మరణించిన సభ్యులకు లోక్‌సభ సంతాపం ప్రకటించింది. వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టుకు సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఆ తరువాత ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. అందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. 'ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదు. ప్రశ్నోత్తరాలకు ప్రతిపక్షాలు సహకరించాలి' అని స్పీకర్ అన్నారు. దీంతో ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే 12 గంటలకు సభను వాయిదా వేశారు.

తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర ఆర్థికశాఖ మిగతా 7లో

2047కు రాష్ట్రం నెంబర్-1

పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి

- 2028కి అమరావతి తొలిదశ పనులు పూర్తి
- పింఛన్ల పంపిణీ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

గోపినాథపట్నంలో గుడ్ల నాగలక్ష్మికి రూ.పది వేల పింఛను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, మోడీ, తాను, పవన్ కల్యాణ్ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 2047 నాటికి దేశం సమర్ధవంతంగా తయారవుతుందని, అందులో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంటుందని అన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపినాథపట్నంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కిడ్నీ బాధితురాలు గుడ్ల నాగలక్ష్మికి రూ.పది వేల పింఛను డబ్బులు అందించారు. అనంతరం నల్లమాడు గ్రామంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ పింఛన్ల కోసం ఇప్పటి వరకూ రూ.50 వేల కోట్లకుపైగా ఖర్చు పెట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యధికంగా రాష్ట్రంలోనే రూ.4 వేలు పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. భర్త చనిపోతే భార్యకు తర్వాత నెల పింఛను వచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. స్త్రీశక్తి పథకం కింద ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకోసం ఇప్పటి వరకూ రూ.855 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద కేంద్రం రూ.ఆరు వేలు, రాష్ట్రం రూ.14 వేలు ఇస్తోందన్నారు. 2027 నాటికి గోదావరి పుష్కరాలకు ముందుగానే పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించారు. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని, 2028 నాటికి ఫేజ్-1 పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆహారపు అలవాట్లు మారాయని, అందుకు అనుగుణంగా రైతులు పంటలు ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టాలన్నారు. జనాభా సమతుల్యంగా ఉండాలంటే ప్రతి కుటుంబం ముగ్గురు పిల్లలను కనాలని సూచించారు.

విశాఖలో జరిగిన సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్లు, అంతకుముందు రూ.8.80 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు తెలిపారు. మాటిచ్చిన ప్రకారం 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మూడు నెలలకోసారి జాబ్‌మేళాలు పెడుతున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి మూడు జోన్లను ఎకనమిక్ జోన్లుగా మారుస్తామన్నారు. వచ్చే జనవరి నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామని, తర్వాత పూర్తి స్థాయిలో రోడ్లు వేస్తామని చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యం కోసం సంజీవని పథకాన్ని తెస్తున్నామన్నారు. దేవాలయాలు, ప్రార్థనా స్థలాల జోలికొస్తే అదే ఆఖరి రోజు అవుతుందని హెచ్చరించారు. కొల్లేరు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎంఎల్ఎ ప్రస్తావించి వినతిపత్రం అందించగా సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామానికి సంబంధించి సాగు భూమి వివరాలను సచివాలయ అధికారి సరిగా చెప్పకపోవడంతో అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉంటే ఎలా అంటూ కలెక్టర్ వెట్రిసెల్విని సున్నితంగా హెచ్చరించారు.

కిడ్నీ బాధిత కుటుంబానికి చేయూత

కిడ్నీ బాధితురాలు గుడ్ల నాగలక్ష్మి కుటుంబానికి చేయూత అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమె కుటుంబానికి ఉన్న అప్పులు పూర్తిగా తీరుస్తామన్నారు. ఆమె కుమారుడికి మంచి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కుమార్తె వాసవి మధ్యలో ఆపేసిన చదవును పూర్తి చేయిస్తామన్నారు. నెలకు రూ.25 వేలు ఆదాయం వచ్చే విధంగా డ్రోన్ ఇస్తామని, ఇంటి యజమానికి ఐస్ ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. బంగారు కుటుంబాల్లో సుంకర మణి కుటుంబానికి ఉద్యోగం ఇప్పించి పిల్లలను చదివించేందుకు మార్గదర్శకులుగా పారిశ్రామికవేత్త పసుపులేటి రామారావు ముందుకొచ్చారు. మరో బంగారు కుటుంబం జాలాది లక్ష్మి కుటుంబానికి ఇల్లు కట్టించి ఆమె కుమార్తె వాత్సల్యను చదివించేందుకు వ్యాపారవేత్త మనోజ్ శంకర్ దత్తా ముందుకొచ్చారు. మార్గదర్శకులను సిఎం సన్మానించారు. ఇప్పటి వరకూ పది లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనికి ముందు వ్యవసాయ, ఉద్యాన, కోళ్ల పెంపకం, మహిళా సాధికారితకు సంబంధించిన స్టాల్స్‌ను చంద్రబాబు పరిశీలించి పలు సూచనలు చేశారు.

వణికిస్తున్న 'దిత్వా'

- తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు
- భీతిల్లుతున్న వరి రైతులు
- కొడవలూరులో 38.7 మిల్లీమీటర్ల వర్షపాతం

వర్షానికి మునిగిన నెల్లూరులోని మాగుంట లేవుట్

ప్రజాశక్తి- యంత్రాంగం

దిత్వా తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. చలి వణికిస్తోంది. వరి రైతులు భీతిల్లుతున్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉంది. నెల్లూరు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. జనజీవనంపై ఈ ప్రభావం పడింది. నెల్లూరులోని మాగుంట లేవుట్‌తోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లూరు జిల్లాలోని సముద్ర తీర ప్రాంత వాసులను ముందుజాగ్రత్త చర్యగా సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. తిరుపతి, చిత్తూరుల్లో ముసురు వాన రెండో రోజూ కొనసాగింది. చిరుజల్లులు వదలకుండా కురుస్తూనే ఉన్నాయి. ఈదురుగాలులతో చలి తీవ్రత పెరిగింది. ఇళ్ల నుంచి జనం బయటకు రావడానికి బెంబేలెత్తుతున్నారు. తిరుమలలో యాత్రికులు గదులకే పరిమితమయ్యారు. విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి చిన్నపాటి వర్షాలు కురుస్తుండడంతో భోగాపురం మండలంలో కోసి ఉంచిన వరి పనలు తడిచి ముద్దయ్యాయి. ముక్కాం వద్ద సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. కెరటాలు ఉధృతంగా రావడంతో సముద్రతీరం కోతకు గురైంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటలకు నెల్లూరు జిల్లా కావలిలో 123.2 మిల్లీమీటర్లు, జలదంకిలో 92.8 మిల్లీమీటర్లు, బోగోలులో 74.8, బుచ్చిరెడ్డిపాలెంలో 62.3, దగదర్తిలో 62.2, సంగంలో 61.8, ఆత్మకూరులో 59.3, పొదలకూరులో 58, అనుమసముద్రంపేటలో 57.2, కొడవలూరులో 53.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం నెల్లూరు జిల్లా కొడవలూరులో 38.7 మిల్లీమీటర్లు, నెల్లూరులో 36.7, తిరుపతి జిల్లా తడలో 33.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఎల్ఎన్.పేట, బూర్జ మండలం కొల్లివలస, ఆమదాలవలస, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో 1.5 మిల్లీమీటర్లు, లావేరులో ఒక మిల్లీమీటరు, సరుబుజ్జిలి మండలం విజయరాంపురం, రణస్థలం మండలం గరికపాలెంలో 0.75 మిల్లీమీటర్లు, పలాస, మందస మండలం హరిపురం, పైడిభీమవరంలో 0.25 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

దిత్వా తుపాన్ సోమవారం సాయంత్రానికి చెన్నయ్‌కి 50 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 130 కిలోమీటర్లు, నెల్లూరుకు 200 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తుపాన్ గంటకు పది కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. దీని ప్రభావం వల్ల దక్షిణ కోస్తా తీరం వెంబడి 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడుతోపాటు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

గుంటూరుపై గంజాయి పంజా

- విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు
- విషవలయంలోకి కొందరు వైద్యులు
- ఒడిశా నుంచి భారీగా తరలిస్తున్న ముఠాలు
- బెంగళూరు, హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఎండిఎం డ్రగ్స్

గుంటూరులో స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయి బాటిల్స్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుపై గంజాయి రక్కసి పంజా విసురుతోంది. కొంత కాలంగా పెరుగుతున్న గంజాయి వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులే లక్ష్యంగా జిల్లాలో పెద్దఎత్తున విక్రయాలు సాగుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో విచల విడిగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కొందరు వైద్యులు కూడా ఈ విషవలయంలో చిక్కుకున్నట్లు పోలీసు అధికారులు గుర్తించడం కలకలం రేపింది. వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. కీలకమైన వైద్య వృత్తిలో ఉన్న వారు సైతం గంజాయికి బానిసలుగా మారడంపై పోలీసులు విస్మయం చెందారు. ఒక వైద్యుడిపై కేసు కూడా నమోదు చేసినట్లు తెలిసింది. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచారు. జిల్లాలోని పలు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులనే లక్ష్యంగా గంజాయి సరఫరా జరుగుతోంది. ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో కొంతమంది విద్యార్థులను గంజాయి మాఫియా ఆకర్షించి వారికి అలవాటుగా చేస్తోంది. ఒకరి నుంచి మరొకరికి చెయిన్ లింక్ విధానం ద్వారా సరఫరా కొనసాగుతోంది. పోలీసులు దాడులు చేసి గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నా ఇంకా పెద్ద ఎత్తున సరఫరా జరుగుతూనే ఉంది. ఒడిశా రాష్ట్రం నుంచి భారీగా గంజాయి సరఫరా జరుగుతున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎండిఎం డ్రగ్స్ బెంగళూరు, హైదరాబాద్ నుంచి ట్రావెల్స్ ద్వారా వస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు అధికారులు వీటిని పట్టుకున్నారు. పలువురిని అరెస్టు చేశారు. అయినా, ముడి గంజాయి, లిక్విడ్ గంజాయి, ఎండిఎం వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా జిల్లాకు సరఫరా అవుతున్నా వీటి మూలాలను నిరోధించలేకపోతున్నారు. గత ఏడాది కాలంలో దాదాపు వంద మందికిపైగా సరఫరా, విక్రయదారులు, కొనుగోలుదారులను పోలీసులు అరెస్టు చేశారు. కానీ, సరఫరా మాత్రం ఆగడం లేదు. ముడి గంజాయిని తీసుకొచ్చి గ్రాముల్లో విక్రయిస్తున్నారు. గంజాయిని లిక్విడ్‌గా మార్చి ఒక్కో డబ్బాలో పది గ్రాముల ఉంచి విక్రయాలు చేస్తున్నారు. ఒక్కో డబ్బా రూ.4,500కు విక్రయిస్తున్నారు. ఇటీవల గుంటూరులోని లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక యువకుడిని పోలీసులు అరెస్టు చేసి 110 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో ఎండిఎం మత్తు పదార్థాలు సరఫరా చేసిన బెంగళూరు వాసి విశాల్ సింగ్ చౌహాన్‌ను పట్టుకున్నారు. గుంటూరులో కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని బెంగళూరు నుంచి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ అని తెలిసి వారికి వినియోగించే అలవాటు లేకపోయినా విక్రయిస్తే డబ్బు ఇస్తామని కొంతమంది యువకులను ఆకర్షిస్తున్నారు. పాత గుంటూరు పరిధిలో 17 గ్రాముల ఎండిఎం (మెత్) డ్రగ్స్‌తో ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి సరఫరా, విక్రయం, వినియోగం కేసుల్లో నగరంపాలెం పోలీసు స్టేషన్లో ఒక మైనర్‌తోపాటు ఏడుగురు యువకులను ఇటీవల అరెస్టు చేసి వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలో 12 మంది నిందితులను గుర్తించి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 1,125 గ్రాముల ముడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐదు గ్రాముల ప్యాకెట్ రూ.500కు విక్రయిస్తున్నారని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. గంజాయి, డ్రగ్స్ విక్రయించే ముఠాలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామని జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. కొందరు వైద్యులు, విద్యార్థులు మత్తుకు బానిస అవుతున్నట్లు పలు కేసుల దర్యాప్తు సందర్భంగా తమ దృష్టికి వచ్చిందని, వీరిపై నిఘా ఉంచామని చెప్పారు. ఒడిశా నుంచి జిల్లాకు గంజాయి ఎక్కువగా వస్తున్నట్టు గుర్తించినట్లు తెలిపారు. బెంగళూరు నుంచి వచ్చే డ్రగ్స్ నియంత్రణకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

14.20 లక్షల మంది 'ఉపాధి' కూలీల తొలగింపు

- ఇ-కేవైసి నిబంధనతో వేటు
- వెల్లడించిన లిబ్‌టెక్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల లక్షలాది మంది వేతనదారులకు ఉపాది దొరకని పరిస్థితి నెలకొంది. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఆధార్ ఆధారిత ఈ-కేవైసిని తప్పని సరి చేసింది. గత నెల 1వ తేదీ నుంచి ఈ-కేవైసి పూర్తి చేసిన వారికే పని చేసే అవకాశం కల్పించడంతో అక్టోబర్ 8 నుంచి నవంబర్ 19వ తేదీ వరకూ రాష్ట్రంలో 14.20 లక్షల మంది ఉపాధి పనులకు దూరమైనట్లు ఈ పథకంపై అధ్యయనం చేస్తున్న లిబ్ టెక్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఉపాధి హామీలో ఈ కెవైసి విధానం అమలుతో ఉపాధి వేతనదారులపై ప్రభావాన్ని ఈ సంస్థ అధ్యయనం చేసి సోమవారం నివేదికను వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరు 8వ తేదీ వరకూ 1.24 కోట్లు మంది వేతనదారులు ఉండగా నవంబర్ 19వ తేదీకి ఆ సంఖ్య 1.10 కోట్లకు చేరింది. కేవలం 42 రోజుల వ్యవధిలో 14.20 లక్షల మంది వేతనదారుల తగ్గుదల నమోదైనట్లు సంస్థ పేర్కొంది. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 27 శాతం, కాకినాడ జిల్లాలో 25 శాతం, తిరుపతి జిల్లాలో 20 శాతం, పశ్చిమ గోదావరి జిల్లాలో 18 శాతం వేతనదారుల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. ఈ పథకంలో క్రియాశీల వేతనదారులు (యాక్టివ్ వర్కర్స్) విషయానికి వస్తే.. అక్టోబరు 8వ తేదీ వరకూ 96.40 లక్షల మంది వేతనదారులు ఉండగా, నవంబరు 19వ తేదీ నాటికి ఈ సంఖ్య 90.20 లక్షలకు క్షీణించింది. మొత్తంగా క్రియాశీలక వేతనదారులు 6.20 లక్షల మంది పనులు తొలగించబడ్డారు. ఈ తొలగింపుల సంఖ్య అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 19 శాతం, కాకినాడ జిల్లాలో 12 శాతం, తిరుపతి జిల్లాలో 11 శాతం, పశ్చిమ గోదావరి జిల్లాలో 10శాతంగా ఉంది.

నిబంధనలు పాటించని వైనం..

ప్రామాణిక నిర్వహణ ప్రక్రియ (ఎస్‌ఓపి) ప్రకారం వేతనదారులను తొలగించాలంటే వారు శాశ్వతంగా వలస వెళ్లడం, మరణించడం, గ్రామాలు పట్టణాలుగా అప్‌గ్రేడ్ అవ్వడం, మిగతా 7లో

మదురోతో మాట్లాడిన ట్రంప్...

వాషింగ్టన్ : అమెరికా-వెనిజులా సంబంధాలు ఉద్రిక్తంగా మారిన వేళ యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆసక్తికర విషయం వెల్లడించారు. ఇటీవల తాను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోతో మాట్లాడినట్టు చెప్పారు. అయితే దేని గురించి చర్చించారన్న విషయాన్ని మాత్రం ట్రంప్ ప్రకటించలేదు. ఈ విషయాన్ని తొలుత న్యూయార్క్ టైమ్స్ బయటపెట్టింది. ఇద్దరి మధ్య అమెరికాలో సమావేశం జరిగే అవకాశం ఉందని తెలిపింది. మదురోతో మాట్లాడారా అని విలేకరులు ప్రశ్నించినప్పుడు స్పందించిన ట్రంప్.. "దీనిపై నేను మాట్లాడదలుచుకోలేదు.. కానీ నా సమాధానం 'అవును' అని చెప్పారు. దీంతో మదురోతో మాట్లాడిన విషయాన్ని ఆయన ధృవీకరించారు. వెనిజులా గగనతలాన్ని అమెరికా మూసేసిన తరువాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నారంటూ కరేబియన్ సముద్రంలో సైన్యాన్ని అమెరికా మోహరించింది. దాదాపు 80 మందికి పైగా అమెరికా దాడిలో మృతి చెందారు. ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంటున్న తరుణంలో ఈ ఫోన్‌కాల్ సంభాషణ వెలుగులోకి రావటం గమనార్హం.

క్రిస్మస్ ఏర్పాట్లలో అపశృతి
విద్యుదాఘాతానికి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

క్రిస్మస్ నెల ప్రారంభం నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఈ ఘటన త్రిపురాంతకం మండలంలోని కొత్త అన్నసముద్రం ఎస్‌సి కాలనీలో సోమవారం జరిగింది. క్రిస్మస్ పండుగ నెల కావడంతో స్టార్స్ నిర్మిస్తుంటారు. ఈ క్రమంలో ఎస్‌సి కాలనీలో స్టార్‌ను ఏర్పాటు చేసేందుకు పచ్చిగొర్ల విజయ్(40), ఉస్తేపురం గ్రామానికి చెందిన వీర్నపాటి దేవయ్య (45) స్తంభాన్ని నిలబెడుతుండగా పైన ఉన్న హై టెన్షన్ వైర్ తగిలి అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. త్రిపురాంతకం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛను డబ్బులపై తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ

- కొడుకు మృతి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ (నెల్లూరు జిల్లా)

పింఛను డబ్బుల గురించి తండ్రీకొడుకుల ఘర్షణలో కొడుకు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బట్టేపాడు అరుంధతీయవాడకు చెందిన మాముడూరు పుల్లయ్య సోమవారం వృద్ధాప్య పింఛను డబ్బులు తీసుకున్నారు. ఈ క్రమంలో పుల్లయ్య కుమారుడు మస్తానయ్య (35) మద్యం కోసం తండ్రిని డబ్బులు అడిగాడు. ఇప్పటికే పెన్షన్ నుంచి రూ.వెయ్యి తీసుకుని మద్యం తాగిన మస్తానయ్య, మరోసారి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పుల్లయ్యకు దెబ్బ తగలడంతో కోపోద్రిక్తుడై మస్తానయ్యపై కర్రతో దాడిచేయగా అతడు స్పృహ కోల్పోయి కుప్పకూలాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వైద్య సిబ్బంది పరిశీలించి మస్తానయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని విచారణ చేశారు. మస్తానయ్య మద్యం మత్తులో స్వయంగా పడి చనిపోయాడని స్థానికులు చెప్పినప్పటికీ, లోతుగా విచారించగా తండ్రి దాడి చేయడమే మృతికి కారణమని అధికారికంగా నిర్ధారించారు. దాంతో పుల్లయ్యపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మస్తానయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మద్యపానం వల్ల భార్యతో విభేదాలు ఏర్పడటంతో ఆమె తల్లితండ్రుల వద్దే ఉంటున్నట్లు సమాచారం.

ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. సచివాలయంలో అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రజలంతా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను మరింతగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు సమృద్ధిగా లభ్యమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమీక్షా సమావేశంలో ఐటి, ఆర్‌టిజిఎస్ ముఖ్యకార్యదర్శి భాస్కర్ కాటమ నేని, సిఇఒ ప్రఖర్‌జైన్, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఎపి ఫైబర్‌నెట్ ఎమ్‌డి గీతాంజలి శర్మ, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ ధాత్రిరెడ్డి, ఆర్‌టిజిఎస్ జాయింట్ డైరెక్టర్ మల్లికాగార్గ్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆలయాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాల్లో యాత్రికుల రద్దీ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. సచివాలయంలోని ఆర్‌టిజిఎస్‌లో పీపుల్స్‌పర్సెప్షన్‌పై సమీక్ష నిర్వహించారు. వరుసగా పండగలు, ప్రత్యేక పర్వదినాలు రానున్నాయని, రద్దీ నియంత్రణకు చేపడుతున్న చర్యలపై నిర్వాహకులు ముందుగా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

పెంచలయ్య హత్యపై

భగ్గుమన్న జనం

స్థానికులు కూల్చివేసిన కామాక్షి నివాసం

- గంజాయి గూండాల ఇళ్లు ధ్వంసం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

గంజాయి గుండాల బరితెగింపుపై భగ్గుమన్న జనాగ్రహం ఇది! పంటిబిగువునా దాచుకున్న బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకున్న దృశ్యం ఇది! గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ నిత్యం చైతన్య పరిచిన తమ మిత్రుడు, మార్గదర్శి పెంచలయ్య అదే గంజాయి గూండాల చేతిలో మరణించడాన్ని ఏమాత్రం సహించలేని ఆర్‌డిటి కాలనీ వాసులు సోమవారం రాత్రి ఒక్కసారిగా రోడ్లమీదకు వచ్చారు. పెంచలయ్యను బలితీసుకున్న గూండాల ఇళ్లపై దాడిచేశారు. నిమిషాల వ్యవధిలో వాటిని ధ్వంసం చేశారు. పెంచలయ్యను అమానుషంగా హత్య చేసిన తీరు మూడు రోజుల నుండి కాలనీ వాసులను కలచి వేస్తోంది. కాలనీ అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి లక్ష్యంగా పెంచలయ్య తమతో చెప్పిన మాటలను, పాడిన పాటలను పలువురు రెండురోజులుగా గుర్తుచేసుకుంటు న్నారు. ఈ క్రమంలో భాగంగానే ఆయన పాడిన పలు పాటలను సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ చేస్తున్నారు. అయినా, గంజాయి గుండాల కారణంగా తాము పడిన బాధలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆదివారం పెంచలయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న జేమ్స్ ఇంటిని స్థానికులు తగలబెట్టారు. తాజాగా సోమవారం రాత్రి రోడ్లమీదకు జనం మరోసారి వచ్చారు. ఈ కేసులో ప్రధాన కుట్రధారుగా ఉన్న అరవ కామాక్షి ఇంటితో పాటు, పోలీసులకు ఆయుధాలతో సహా దొరికిన ఆమె సోదరులు జేమ్స్, కార్తీక్, కామాక్షి అత్త, జోసప్ ఇళ్లను కూల్చివేశారు. ఈ పని వేగంగా జరగడానికి జెసిబిల సహాయాన్ని తీసుకున్నారు. ఇళ్లు పూర్తిగా ధ్వంసమైన తరువాత అక్కడే నిలబడి గంజాయి గూండాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 'వాళ్లు చంపింది పెద్దవాడినా... చిన్నవాడినా అన్నది కాదు ... మంచి చెప్పిన వాడిని చంపేశారు..దీన్నెలా సహిస్తాం' అని ప్రశ్నించారు. 'అటువంటి వారిని మా ఇళ్ల పక్కన ఎలా ఉంచుతాం' అని వారు అన్నారు. హత్యాకాండ జరిగినప్పటి నుండి ఈ ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయని, ఇళ్లలో ఎవ్వరూ లేరని చెప్పారు. గంజాయి గుండాలకు వ్యతిరేకంగా మంగళవారం నెల్లూరు జిల్లా బంద్ జరగనున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ సంఘటన కలకలం రేపింది.

నెల్లూరు జిల్లా బంద్‌కు పలు పార్టీల మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెంచలయ్య హత్యకు నిరసనగా, గంజాయి ముఠాల కార్యకలాపాలకు వ్యతిరేకంగా మంగళవారం బంద్ నిర్వహించాలని సిపిఎం పిలుపు ఇవ్వడంతో పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. బంద్‌కు తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పి) తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకి రాములు తాజాగా తెలిపారు. బంద్‌ను జయప్రదం చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి సుందరరామ రాజు, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) కార్యదర్శి బంగార్రావు, ఆప్ కన్వీనర్ ఎస్ రమేష్ వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. బంద్‌ను బలపరుస్తున్నామని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నెల్లూరు జిల్లా కమిటీ వెల్లడించింది. పెంచలయ్య హత్యపై బంద్‌ను జయప్రదం చేయాలని ఆ పార్టీ నెల్లూరు జిల్లా కార్యదర్శి సిఎస్ సాగర్ మరో ప్రకటనలో కోరారు. బంద్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఎస్‌యుసిఐ, లోక్‌సత్తా పార్టీలు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించాయి.

క్వాంటం వ్యాలీకి 50 ఎకరాల్లో
రెండు ఎకరాల్లో భవనాలు

- సిఆర్‌డిఎ కార్యాలయం పక్కనే భూమి కేటాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలను కేటాయించారు. అందులో రెండు ఎకరాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్(ఎక్యూసిసి) సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇది జాతీయ సాంకేతిక భవిష్యత్ కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాయపూడి పరిధిలోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయానికి ఉత్తరభాగంలో సీడ్ యాక్సెస్‌రోడ్డు అవతల దీనిని నిర్మించనున్నారు. క్వాంటం భవన నిర్మాణం కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచారు. ఈ నెల ఆరోతేదీతో టెండర్ల గడువు ముగియనుంది. ప్రాజెక్టు వ్యాల్యూను పేర్కొనకపోయినా నిర్దేశిత ధరకంటే ఎవరు తక్కువకు టెండర్ వేస్తే వారికి కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం విట్ యూనివర్శిటీలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో రాయపూడి వద్ద నిర్మించే శాశ్వత భవనంలోకి దీన్ని మార్చనున్నారు. అనంతరం అమరావతిని పూర్తిస్థాయి క్వాంటం సిటీగా మార్చాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును సిఆర్‌డిఎ ఐటి అండ్ ఈ శాఖ సంయుక్తంగా ఖర్చు చేయనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు. ప్రస్తుత భవనాన్ని జిప్లస్ 1 అంతస్తుగా 4,201 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మెకానికల్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్, ఫైర్(ఎంఈపిఎఫ్)తో గ్రీన్ బిల్డింగ్ నిబంధనల ప్రకారం భవనం నిర్మించనున్నారు. దీనిలో గ్రౌండ్ ఫ్లోర్ 1,999 చదరపు మీటర్లు, మొదటి ఫ్లోర్ 1,992 చదరపు మీటర్లు, బేస్‌మెంట్ 210 చదరపు మీటర్లతో నిర్మించున్నారు. ఇవి కాకుండా హెడ్ రూము 109, డెక్ ఏరియా 130 చదరపు మీటర్ల విస్తీర్ణంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌గా మార్చాలనేది ప్రతిపాదనగా ఉంది. దీనికోసం ఇటీవల క్వాంటం వర్కుషాపు కూడా నిర్వహించారు. టిసిఎస్, ఐబిఎంతోపాటు దేశంలో పలు ఐటి కంపెనీల ప్రతినిధులనూ దీనికి ఆహ్వానించారు. ఇందులో భాగంగా ఐబిఎం 150 క్యూబిట్ కెపాసిటీతో కంప్యూటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. టిసిఎస్ అవసరమైన సాంకేతిక నైపుణాన్ని ఇవ్వనుంది. ఎల్‌అండ్‌టి నిర్మాణపరమైన అంశాల్లో భాగస్వామ్యం కానుంది. ఇలా మూడు కంపెనీలతో ఇటీవల ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడంతోపాటు క్వాంటం పాలసీని విడుదల చేసింది. వీటిల్లో భాగంగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలవడం ద్వారా ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసింది.

'ఉపాధి'లో కొత్త నిబంధనలొద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకూ నిర్వీర్యం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి పథకాన్ని మరింత నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు పూటలా పని, ఫేస్ యాప్, 4 గంటలకోసారి మస్టర్ నిబంధనలను అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ విధానాన్ని అమలు చేయడానికి దేశంలో మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని తెలిపారు. మన రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ఈ మూడు జిల్లాల్లో ఒకటిగా ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ చర్యల కారణంగా 40 లక్షల మంది గ్రామీణ పేదలు పని కోల్పోతున్నారని తెలిపారు. వివిధ నిబంధనలు, రాజకీయ కారణాలతో 18.40 జాబ్ కార్డులు తొలగించారన్నారు. సుమారు రూ.400 కోట్లు పేదలకు రావాల్సిన కేంద్ర నిధులు కోతపడ్డాయని వెల్లడించారు. ఈ పథకంలో అవినీతికి కారణం అధికార పార్టీ నాయకులు, కాంట్రాక్టర్లు, కుమ్మక్కై కూలీలు చేయాల్సిన పనులను యంత్రాలతో చేయించి రూ.వందల కోట్లు కొల్లగొడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో గత జూన్ నెలలో చేసిన పనులకు రూ.346 కోట్లు బకాయిలు నేటికీ చెల్లించలేదన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని, కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలు ఉపసంహరించుకోవాలని కోరారు. లేని పక్షంలో కొత్త విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

అభ్యుదయ ఉద్యమాలకు గాదె సుబ్బారెడ్డి వెన్నుదన్ను

- ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఆట పాట మాట ద్వారా కళానివాళి

గాదె సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, డి.రమాదేవి, బి.తులసీదాస్, మంతెన సీతారాం, అనిల్, మంగరాజు, పిఎన్‌ఎం నాయకులు, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - విజయవాడ

కళారూపాల ద్వారా నిర్మించే అభ్యుదయ ఉద్యమాలకు గాదె సుబ్బారెడ్డి వెన్నుదన్నుగా నిలిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఘనంగా నివాళులర్పించారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి ప్రథమ వర్ధంతి సభ విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియం)లో జరిగింది. తొలుత సుబ్బారెడ్డి చిత్రపటానికి వి.శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి నాయకులు, సభికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'గాదె సుబ్బారెడ్డి - కళానివాళి - ఆట పాట మాట' కార్యక్రమం ఆద్యంతం ఉత్తేజపూరితంగా సాగింది. నటుడిగా, దర్శకుడిగా, రచయితగా, మంచి ఆర్గనైజర్‌గా ప్రజా నాట్యమండలికి సుబ్బారెడ్డి అందించిన బహుముఖ సేవలను నాయకులు ప్రస్తుతించారు. సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్బారెడ్డి కళారూపాల ద్వారా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి ఆదర్శనీయమైన కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పార్టీ నిర్మాణంలో ఓ ముఖ్య పాత్ర నిర్వహించారని వివరించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పరిచారన్నారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా అనేక కళారూపాలను రూపొందించారని గుర్తుచేశారు. యువ కళాకారులను తీర్చిదిద్దడంలో, వారిని ప్రోత్సహించడంలో ముందుండేవారన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ఏర్పాటులో కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలను వాస్తవాల ప్రాతిపదికన చైతన్యపర్చడంలో కళారూపాలు కూడా ముఖ్య పాత్ర పోషించాలని శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

ఉద్యమ స్ఫూర్తితో పిఎన్‌ఎం దళాల ప్రదర్శనలు

వర్ధంతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానాట్యమండలి దళాలు ఉద్యమ స్ఫూర్తితో ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 32 రకాల కళారూపాలతో.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ సుబ్బారెడ్డికి ఘనంగా నివాళు లర్పించారు. పిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు మంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ సమన్వయ పరిచారు. పిఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుర్రం రమణ, వి.నాగరాజు, ఐ.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.ఖాసిం తదితరులు కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, నాయకులు మంతెన సీతారామ్, సుబ్బారెడ్డి భార్య, ఉద్యమ సహాధ్యాయి శివలీల, కుమార్తెలు శిరీష, ఆషా, అల్లుళ్లు, మనుమలు, పిఎన్‌ఎం సభ్యులు, నాయకులు, సుబ్బారెడ్డి మిత్రులు, బంధువులు పాల్గొన్నారు.

అన్యమతస్తులను గుర్తించండి

- తదుపరి చర్యకు నివేదిక తయారు చేయండి : టిటిడి ఇఒ
- టిటిడి పరిధిలోని ఆలయాల్లోనూ అన్నప్రసాదాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

టిటిడిలో ఇంకా ఎవరైనా అన్యమతస్తులు ఉంటే వారిని గుర్తించి తదుపరి చర్య కోసం నివేదిక తయారు చేయాలని అధికారులను టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశించారు. టిటిడి పరిధిలోని ఇతర ఆలయాల్లోనూ తిరుమల తరహాలో యాత్రికులకు అన్నప్రసాదాలను అందించాలని సూచించారు. టిటిడిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టిటిడి పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ... టిటిడి ఆధ్వర్యంలోని ఆలయా లలో అన్నప్రసాదాల పంపిణీకి సంబంధించి పోటు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, అన్నప్రసాదాల పంపిణీ పటిష్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టిటిడి ఆలయాలలో ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాలపై రోజు వారి నివేదికను తయారు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా టిటిడి పరిధిలో చేరిన చారిత్రాక ఆలయాలకు, ఇతర ఆలయాలకు ఏయే ఆలయాలకు వేద పారాయణదారులను నియమించాలి, ఎంత మంది అర్చకులను నియమించాలనే అంశంపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పోటు వర్కర్ల పదాన్ని ముఖ్య పాచిక, పాచికగా మార్చాలని టిటిడి బోర్డులో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి వేగంగా పోటు వర్కర్ల పేర్లను మార్చే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 25 ఎకరాలలో ఇది వరకే ఉన్న ఆలయంతో పాటు ఇకపై నిర్మించనున్న కల్యాణ కట్ట, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి తదితర నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెఇఒ వి. వీరబ్రహ్మం, సివిఎస్ఒ కే.వి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం'ను పోలవరం జిల్లాలో కలపాలి

- ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- 5న ఉద్యమ కార్యాచరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

పోలవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాలో కలపాలని ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో వైసిపి, సిపిఎం, పిడిఎస్‌యు, పివైఎల్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, పిఒడబ్ల్యు, గిరిజన జ్యోతి, ఎపిసిసి, కెఎఎస్ ఆదివాసీ సేన, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి నాయకులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం అశాస్త్రీయమన్నారు. దీనిపై పోలవరం ఎంఎల్ఎ అభిప్రాయం ఏమిటో తెలియజేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులుగా మిగిలిన గిరిజనులకు జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారని తెలిపారు. చింతూరు, కూనవరం నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సుమారు ఏడు వేల ఎకరాల భూసేకరణ చేస్తున్నారని అన్నారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపడం వల్ల ముఖ్యంగా నిర్వాసితులకు మేలు జరుగుతుందని వివరించారు. వైసిపి నాయకులు గుగులోతు మోహన్‌రావు, ఆరేటి సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు టి.బాబూరావు, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు ఉన్న పోలవరం ప్రాంతాన్ని పోలవరం జిల్లాలోకి తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. షెడ్యూల్ ప్రాంత గిరిజనుల సమస్యలు, ఏజెన్సీ ప్రాంత ప్రజల జీవన శైలి, ప్రజాభిప్రాయం, భౌగోళిక పరిస్థితులు వాస్తవికతను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న మరోసారి సమావేశమై ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని సమావేశం నిర్ణయించింది. కార్యక్రమంలో కోట రామచంద్రపురం సర్పంచ్ యు.బొజ్జి, న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు టి.బాబూరావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, కాంగ్రెస్ నేత బండి విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

తాళ్లవలసలో డయేరియా కేసులపై సిఎం ఆరా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా కేసుల నమోదుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. గ్రామస్థులు ఎందుకు అనారోగ్యం పాలవుతున్నారో గుర్తించాలని వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను సోమవారం ఆదేశించారు. సరఫరా అయ్యే నీటిలో ఎక్కడైనా మలినాలు కలుస్తున్నాయా? లేక ఇతర కారణాలా? అనేది విశ్లేషించాలని సూచించారు. గ్రామస్థులందరికీ సురక్షితమైన మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సమీప గ్రామాలపైనా దృష్టి సారించాలన్నారు. తాళ్లవలస గ్రామంలోని పరిస్థితిని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వివరించారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు అస్వస్థతకు గురైన ఆరుగురిని టెక్కలి ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. సోమవారం మరో ముగ్గురిని ఆస్పత్రుల్లో చేర్పించామన్నారు. బాధితులంతా వేర్వేరు కుటుంబాలకు చెందినవారని తెలిపారు. చిన్నారావు అనే వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించారని, అతని మృతికి కారణం డయేరియా కాదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో ఐదుగురు చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని, ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. గ్రామంలో ఉన్న బావి ద్వారా ఐదు పబ్లిక్ కుళాయిలకు,మరో రెండు చేతి పంపుల ద్వారా నీరు సరఫరా జరుగుతోందని వివరించారు. ఈ నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా పరీక్షించగా ఎక్కడా కలుషితం లేదని, తాగడానికి సురక్షితమేనని తేలిందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా బావి నుంచి నీటి సరఫరాను నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా ప్రస్తుతం సరఫరా చేస్తునట్లు పేర్కొన్నారు. గ్రామంలో డయేరియా ప్రబలడానికి అసలు కారణాన్ని కనుగొనేందుకు డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఎపిడెమియాలజిస్ట్ గ్రామంలోనే ఉండి పరిశీలిస్తున్నారని వివరించారు. వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులకు ఐఎఎస్ కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

వరకట్నం వేధింపులు తాళలేక ఐఎఎస్ కుమార్తె తనువు చాలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత అనతి కాలంలోనే వరకట్న వేధింపులకు భర్త పాల్పడడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి నవోదయ కాలనీలో ఆదివారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు....ఎపిపిఎస్‌సి కార్యదర్శి ఎస్.చిన్నరాయుడు కుమార్తె మాధురి... రాజేష్‌నాయుడు అనే యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ' మీ తండ్రి ఐఎఎస్ కనుక ఆయన వద్ద డబ్బులు ఉంటాయని, వాటిని తీసుకురావాలి' అని మాధురిని రాజేష్‌నాయుడు నిత్యం వేధించేవాడు. వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని మాధురి ఆత్మహత్య చేసుకున్నారు. వరకట్న వేధింపులు తాళలేకే తమ కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని చిన్నరాయుడు తెలిపారు. వేధింపులు తాళలేక గత నాలుగు నెలల క్రితం తమ కూతురు తాడేపల్లిలోని తమ ఇంటికి వచ్చిందని చెప్పారు. మానసికంగా తమ కూతురిని అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లి ఆరోపించారు. ఈ కేసును మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో నంది అవార్డులు, నాటకోత్సవాలు

- సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్‌లో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు ప్రతిష్టాత్మక నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను త్వరలో పునరుద్ధరిస్తామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబయిలో జరుగుతున్న 'సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025' కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో సమగ్రమైన కొత్త ఫిల్మ్ టూరిజం పాలసీని ఆవిష్కరించడానికి వేగంగా పనిచేస్తున్నామని అన్నారు. ఫిల్మ్ టూరిజం పాలసీ ప్రొడక్షన్ నుంచి ఎగ్జిబిషన్ వరకు తెలుగు సినిమా పరిశ్రమను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక విజనరీ డాక్యుమెంట్‌గా పాలసీ ఉంటుందని అభివర్ణించారు. భారతదేశ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తామన్నారు. కలిసి పనిచేద్దామని ఇన్వెస్టర్లను కోరారు. దేశంలో హిందీ తర్వాత తెలుగు సినీ పరిశ్రమ రెండో అతిపెద్దదిగా నిలిచిందన్నారు. జాతీయ చలనచిత్ర పరిశ్రమకు దాదాపు 20 శాతం వాటాను అందిస్తోందన్నారు. ఈ రంగానికి తమ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక, అతిథ్య రంగాలకు పరిశ్రమ హోదా కల్పించడం వల్ల అన్ని రకాల రాయితీలకు త్వరితగతిన అర్హత లభిస్తుందన్నారు. 2029 నాటికి రూ.25 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

అలక వీడండి

- పార్టీ మండలాధ్యక్షులకు లోకేష్ సూచన
- టిడిపి కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ నేతలు అలక వీడాలని, సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకురావాలని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆ పార్టీ నేతలతో అన్నారు. టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో లోకేష్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ కుటుంబం వంటిదని, చిన్నచిన్న సమస్యలు సహజమన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, కుటుంబ సాధికార సారథులతో కలిసి కూర్చొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. మై టిడిపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తామన్నారు. గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా పనిచేయాలనేది పార్టీ సిద్ధాంతం, విధానమని చెప్పారు. ప్రజల మనసులు గెలుచుకునేలా పనిచేయాలని, స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పనిచేసే వారిని ప్రోత్సహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, విధులు, బాధ్యతలపై మార్గదర్శనం చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శుల అభిప్రాయాలను లోకేష్‌కు నివేదించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జెండా ఊపి.. పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ఐక్యతగా ట్రిబుల్ ఐటి సాధించుకుందాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ప్రజాశక్తి - పామూరు (ప్రకాశం జిల్లా)

అందరం ఐక్యతగా ఉండి... పోరాటాలు సాగించడం ద్వారా ట్రిబుల్ ఐటి కళాశాలను సాధించుకోగలమని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. పామూరు మండలంలోని దూబగుంట వద్దనే ట్రిబుల్ ఐటి కళాశాలను నిర్మించాలని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరుతూ సోమవారం సిపిఎం చేపట్టిన పాదయాత్రను పామూరులోని సుందరయ్య భవన్ సెంటర్లో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ వెనుకబడి ఉన్న పామూరు, సిఎస్‌పురం మండలాలు అభివృద్ధి చెందాలంటే ట్రిబుల్ ఐటి కళాశాలను నిర్మించాలని కోరారు. జిల్లాలో పశ్చిమ ప్రకాశం వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంత అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడమే శరణ్యమని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూనే పాలకులు 30 సంవత్సరాల నుండి కాలయాపన చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, నాయకులు పాల్గొన్నారు.

'పరకామణి' కేసులో సూత్రధారి భూమన కరుణాకర్‌రెడ్డే

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల శ్రీవారి ఆలయం పరకామణిలో చోరీకి సంబంధించిన విచారణ వేగంగా జరుగుతోందని, ఈ కేసులో సూత్రధారి, పాత్రధారి వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డేనని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరకామణి కేసులో అతి త్వరలో విచారణ నివేదిక ఇస్తారని, అసలు నిందితులెవరో తెలిసిపోతుందని అన్నారు. ఈ కేసులో భూమన ఉండబట్టే కేసు విచారణపై వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. కల్తీ నెయ్యి కేసులోనూ తప్పు జరిగినట్లు విచారణలో అందరూ ఒప్పుకుంటున్నారని, తప్పు మాత్రం ఒకరిపై మరొకరు నెట్టుకుంటున్నారని అనగాని పేర్కొన్నారు.

హోటల్ రాజ్ పార్కుకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని హోటల్ రాజ్‌పార్కుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని రాజ్ పార్క్ హోటల్‌కు సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు హోటల్‌ను ఆర్‌డిఎక్స్‌తో పేల్చేస్తామంటూ ఇ-మెయిల్ పంపారు. హోటల్ యజమాన్యం అలిపిరి పోలీసులకు విషయాన్ని తెలిపింది. అలిపిరి ఎస్‌ఐ అజిత ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్ హోటల్ వద్దకు చేరుకొని ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబంధిత హోటల్ నిత్యం వేలాది మంది యాత్రికులు తిరగాడే కపిలతీర్థంకు అత్యంత చేరువలో ఉండడంతో అటు పోలీసులు, ఇటు యాత్రికులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఎవరో ఆకతాయిలు చేసిన పని అని ఊపిరి పీల్చుకున్నారు. అయితే, గతంలో సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగానూ రెండుమూడుసార్లు బాంబు బెదిరింపు ఇ-మెయిల్స్ వచ్చాయి. ఇ-మెయిల్స్ ఎవరు చేశారన్నది పోలీసులు తేల్చాల్సి ఉంది.

నార్కోటిక్ హబ్‌గా నెల్లూరు

- ఎమ్మెల్సీ, వైసిపి సిటీ ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

గతంలో ప్రశాంతమైన వాతావరణానికి నిలయంగా నెల్లూరు ఉండేదని, నేడు నార్కోటెక్ హబ్‌గా, గంజాయి, డ్రగ్స్‌కి ఆవాసంగా మారిందని ఎమ్మెల్సీ, వైసిపి సిటీ ఇన్‌ఛార్జ్ పర్వత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రాంజీ నగర్‌లోని వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటెలిజెన్స్ పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, ఈ నేపథ్యంలో నెల్లూరులో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి బ్యాచ్ హత్యలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. పట్టణంలో 24 గంటలు గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారని, తద్వారా సామాన్య ప్రజలు ఇల్లు దాటి బయటకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. బయట ఖైదీలను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడంతో ఇక్కడ ఉన్న చిన్నపాటి స్థానిక రౌడీలతో వారు గ్యాంగ్‌గా ఏర్పడి అంతర్రాష్ట్రాల నుంచి గంజాయి, డ్రగ్స్ దిగుమతి చేసుకొని స్థానిక రౌడీలతో గంజాయి అమ్మకాలు విమర్శించారు.

వైకుంఠ ద్వార దర్శనాలకు 24 లక్షల మంది నమోదు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల వైకుంఠ ఏకాదశి, ద్వాదశితో పాటు జనవరి ఒకటిన శ్రీవారి దర్శనం కోసం తొలి మూడు రోజులకు 1.76 టిక్కెట్లకు గాను 9.6 లక్షల రిజిస్ట్రేషన్‌ల ద్వారా 24,05,237 మంది నమోదు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు డిప్‌లో పాల్గొన్న వారి సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు రానున్నాయి.

ఉక్కులో అవినీతిపై సిబిఐ విచారణ

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్
- కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే 'ప్లాంట్'ను నష్టాల పాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మీడియాతో మాట్లాడుతున్న నర్సింగరావు, పక్కన జగ్గునాయుడు, కుమార్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌తో కలిసి విశాఖలోని నండూరి ప్రసాదరావు భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ... విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని 'కోక్ ఓవెన్' డిపార్టుమెంట్‌లో గత 35 సంవత్సరాలలో ఎన్నడూ వాడని నాసిరకం కోక్ వాడుతున్నారని, దీనివల్ల నాణ్యత లేని ఉత్పత్తి అవుతుందని, దీనిని కొనుగోలుదారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. నాణ్యతకు మారుపేరైన విశాఖ ఉక్కు పేరును చెడగొట్టాలని తాత్కాలిక సిఎండి కంకణం కట్టుకున్నారని విమర్శించారు. విదేశాల నుంచి దిగుమతి చేసే కోకింగ్ కోక్ బదులు మార్కెట్‌లో లభించే నాసిరకం కోక్‌ను కమీషన్ల కోసం కొంటున్నారని వివరించారు. నాసిరకం ఇనుప ఖనిజం వాడడంపై గతంలో సిబిఐకి సిఐటియు ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు. జగ్గయ్యపేటలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల నుంచి వచ్చే సున్నపురాయి (లైమ్ స్టోన్) సరఫరా లేకపోవడంతో స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్‌ఎంఎస్)లో రెండు రోజులు ఉత్పత్తి ఆగిపోయిందని తెలిపారు. ప్లాంట్‌లో ఎప్పుడూ 45 రోజులకు సరిపడా ముడి ఖనిజాల నిల్వ ఉండాలని, కానీ నేడు కనీసం మూడు రోజులకు సరిపడా నిల్వలు కూడా ఉండడం లేదన్నారు. 2025 ఏప్రిల్‌లో రూ.74 కోట్లు, మే లో రూ.52 కోట్లు లాభాలు వచ్చాయని, అప్పటి వరకు రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లే నడిచాయన్నారు. 2025 జూన్ నుంచి మూడవ బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించినప్పటి నుంచి జూలైలో రూ.121, ఆగస్టులో రూ.157 కోట్లు నష్టాలు వచ్చాయని తెలిపారు. ముడిసరుకు ఖర్చు పెంచి కావాలనే స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టడానికి కారకులెవరని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కారకులెవరో వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించాలని కోరారు. యాజమాన్యం అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు కార్మికులను ద్రోహులుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇటీవల బిఎఫ్-3లో కన్వెయర్ బెల్ట్‌ను కార్మికులు కట్ చేశారని సిఎండి చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే నిర్ణయంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి కావాలని నెడుతున్నాయని విమర్శించారు.

పవర్‌ప్లాంట్‌పై ఎమ్మెల్యే రవికుమార్‌ను నిలదీస్తున్న గిరిజనులు

ఆమదాలవలస ఎమ్మెల్యేకు థర్మల్ సెగ

- రవికుమార్‌ను నిలదీసిన గిరిజనులు
- పింఛన్లు తీసుకోకుండా నిరసన

ప్రజాశక్తి - సరుబుజ్జిలి, బూర్జ

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు థర్మల్ సెగ తగిలింది. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని థర్మల్ ప్లాంట్ ప్రభావిత ప్రాంతాలకు సోమవారం వెళ్లిన ఆయన్ను గిరిజనులు నిలదీశారు. 'ఎమ్మెల్యే గో బ్యాక్, పవర్ ప్లాంట్ వద్దు' అంటూ మహిళలు నినాదాలు చేశారు. బూర్జ మండలంలోని జంగాలపాడు, అడ్డూరిపేట, బొడ్లపాడు, మసానుపుట్టి గిరిజన గ్రామాల ప్రజలు పింఛను తీసుకునేందుకు నిరాకరించారు. థర్మల్ ప్లాంట్ ప్రతిపాదన విరమించుకుంటున్నట్లు ప్రకటిస్తేనే పింఛన్లు తీసుకుంటామని తేల్చి చెప్పారు. 'ఉందో, లేదో తెలియదని, పవర్‌ప్లాంట్ గురించి ఇప్పుడు ఎందుకని, పింఛను తీసుకోవాలని' ఎమ్మెల్యే సర్దిచెప్పినా ససేమిరా అన్నారు. దీంతో ఎమ్మెల్యే అక్కడ్నుంచి వెనుదిరిగారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో థర్మల్ ప్లాంట్‌కు అనుకూలంగా ఎమ్మెల్యే మాట్లాడడంతో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులకు, గిరిజనులకు మధ్య మాట మాట పెరిగి వాగ్వివాదానికి దారితీసింది. ఒక దశలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఎటువంటి ఇబ్బందులు ఉండవని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గిరిజనులు మాకే ప్లాంట్ వద్దని తెగేసి చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలతో కూడిన ఫ్లెక్సీలు వెలిశాయి. అటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం చట్ట విరుద్ధమని, వాటిని తొలగించాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు చెప్పినా, వెన్నెలవలస గ్రామస్తులు నిరాకరించారు. ఫ్లెక్సీలు తొలగిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేయడంతో అధికారులు మిన్నకుండిపోయారు. ఆమదాలవలస సిఐ ఆధ్వర్యాన సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస ఎస్‌ఐలు, సిబ్బంది, ఎస్‌టిఎఫ్ పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టారు.

ముగిసిన పరకామణి కేసు విచారణ

- నేడు హైకోర్టుకు 156 పేజీలతో సిట్ నివేదిక

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల పరకామణి కేసు విచారణ సోమవారం పూర్తయ్యింది. ఈ కేసుకు సంబంధించి డిసెంబర్ 2న (మంగళవారం) నివేదికను సమర్పించాల్సిందిగా హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే. దీంతో సిఐడి అధికారులు హైకోర్టుకు నివేదికను సమర్పించే అవకాశం ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణి కేసును అక్టోబర్ 27న సిఐడి అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యానార్ నేతృత్వంలో సిఐడి విచారణ చేపట్టింది. ఈ కేసులో వైసిపి ప్రభుత్వ హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పని చేసిన వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, అప్పటి ఇఒ ధర్మారెడ్డితో పాటు మొత్తం 35 మందిని సిఐడి అధికారులు విచారించారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు సిఐ సతీష్ కుమార్ విచారణకు వెళ్తూ హత్యకు గురవడం మరో సంచలనం. చెన్నై, బెంగుళూరు, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతిల్లో నిందితుడు రవికుమార్, ఆయనకు సంబంధించిన వారి ఆస్తులను పరిశీలించి, వాటి డాక్యుమెంట్లను సిఐడి సేకరించింది. గత ప్రభుత్వంలో లోక్‌అదాలత్ రాజీ నేపథ్యంలో తిరుపతి రెండవ అదనపు కోర్టు సిబ్బందినీ సిఐడి అధికారులు ప్రశ్నించారు. సోమవారంతో ఈ కేసు విచారణ పూర్తవడంతో సుమారు 156 పేజీల నివేదికను హైకోర్టుకు సిఐడి సమర్పించే అవకాశం ఉంది. దీంతో కేసుతో సంబంధమున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది.

కైలాసగిరిపై గాజు వంతెన ప్రారంభం

- రూ. ఏడు కోట్లతో నిర్మాణం
- ఒకసారి 40 మందికి అనుమతి

గాజు వంతెన ప్రారంభంలో ఎంపి శ్రీభరత్, అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై సుమారు రూ.ఏడు కోట్ల ఖర్చుతో నిర్మించిన గాజు వంతెనను విశాఖ ఎంపి మతుకుమిల్లి శ్రీభరత్, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ సోమవారం ప్రారంభించారు. అనంతరం విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ... కైలాసగిరిపై ఇప్పటికే స్కై సైక్లింగ్, పారా గ్లైడింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు సుమారు రూ.ఏడు కోట్ల ఖర్చుతో ఆదాయ భాగస్వామ్యం పద్ధతిలో గాజు వంతెనను నిర్మించినట్లు చెప్పారు. సముద్ర మట్టానికి సుమారు 1020 అడుగుల ఎత్తులో అత్యంత సురక్షితమైన 40 ఎంఎం మందంగల గాజుతో, 55 మీటర్ల పొడవుతో నిర్మితమైన దేశంలోనే మొట్టమొదటి గాజు వంతెన అని తెలిపారు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను (హుదూద్ తుపాను) కూడా తట్టుకొని నిలబడేలా రూపొందించామని, ఒకేసారి సుమారు వంద మంది వెళ్లినా తట్టుకునేలా రూపకల్పన చేసినట్లు వివరించారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఒకసారి 40 మందికి మాత్రమే అనుమతించనున్నట్లు చెప్పారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్ట్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ.. కైలాసగిరిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ మధుసూదనరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రవిశంకర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి బలోపేతానికి లీన్ కన్‌స్ట్రక్షన్ : మంత్రి నారాయణ

ప్రజాశక్తి- ఏర్పేడు (తిరుపతి జిల్లా)

పట్టణాభివృద్ధి బలోపేతానికి లీన్ కన్‌స్ట్రక్షన్ ఉపయోగకరంగా ఉంటుందని ఎపి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని ఐఐటిలో నాలుగు రోజులపాటు జరుగుతున్న 8వ ఇండియన్ లీన్‌కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ ఇండస్ట్రీ డే ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. కాన్ఫరెన్స్‌కు దేశంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యావేత్తలు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ రంగంలో తక్కువ టైంలో పెట్టుబడి తగ్గించి, మంచి క్వాలిటీని, క్వాంటిటీని బలపరిచే విధంగా లీన్ కన్‌స్ట్రక్షన్ పనిచేస్తుందని వివరించారు. లీన్‌కన్‌స్ట్రక్షన్ పని విధానంతో నిర్మాణ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని అన్నారు. మున్సిపల్, పట్టణాభివృద్ధిని బలోపేతం చేయడంలో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ పనులకు లీన్ కన్‌స్ట్రక్షన్స్ సేవలను ఉపయోగించుకుంటామని తెలిపారు. మొదటగా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి తరువాత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం ఐఐటిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. సంబంధిత విభాగాధిపతులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ, ఇండస్ట్రీ డే పాట్రాన్ అనుప్ మ్యాథ్యూ, లీన్ కన్‌స్ట్రక్షన్ సభ్యులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా

నేడు నెల్లూరు జిల్లా బంద్

- ప్రజా, వామపక్ష, దళిత, వర్తక, యువజన, రాజకీయ పార్టీల సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా గాయకులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం నెల్లూరు జిల్లా బంద్‌కు సిపిఎం పిలుపునిచ్చింది. ఈ బంద్‌కు వైసిపి, టిడిపి, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఎంఎల్ న్యూడెమొక్రసీ, బిఎస్‌పి, ఇసికె, ఎంఆర్‌పిఎస్‌తో పాటు దళిత సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు నెల్లూరులో స్థానిక గాంధీబొమ్మ నుంచి విఆర్‌సి, మద్రాసు బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. తుపాన్ వచ్చినా బంద్ నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. బంద్‌కు సంబంధించిన విషయాలపై సిపిఎం నాయకులతో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. బంద్‌కు కలిసి రావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. బంద్‌కు వర్తక, వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్లు, ఆర్‌టిసి, ప్రయివేటు బస్సుల యాజమాన్యం, విద్యా సంస్థలు, హోటళ్లు, లారీ యజమానుల సంఘాలు, విద్యా సంఘాలు, యువజన సంఘాలు, రాజకీయపార్టీలు మద్దతు ప్రకటించాయి. ప్రజా సంఘాలతోపాటు, ముస్లిం సంఘాలు ఆవాజ్, ఇన్సాఫ్‌తోపాటు యువజన సంఘాలు ముందుకొచ్చాయి. ఆర్‌డిటి కాలనీలో అరాచక శక్తులు, గంజాయి బ్యాచ్‌కు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు విడిచిన పెంచలయ్యకు సంఘీభావంగా ఆర్‌డిటి కాలనీ వాసులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనేందుకు ముందుకొస్తున్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. గుంటూరు ఐజి శ్రీసర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్‌పి డాక్టర్ అజితా వేజెండ్ల నగరంలోని పలు పోలీసు స్టేషన్లను సోమవారం సందర్శించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకూడదని ఆదేశించారు.

బంద్‌కు కదలిరండి : మూలం రమేష్

గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, గుండాల చేతిలో పెంచలయ్య ప్రాణాల విడిచారని, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని, మంగళవారం జరిగే బంద్ అందుకు ప్రారంభమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు.

బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించడంతోపాటు, గంజాయి, మాదకద్రవ్యాలు పూర్తిగా రూపుమాపే వరకూ ఉద్యమంలో కలిసిరావాలని ప్రజలను కోరారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లు అరెస్టు

- రూ.32 లక్షలు నగదు, 25 ఎటిఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి కేంద్రంగా డిజిటల్ అరెస్టు, ఫేక్ సిబిఐ, ఇడి అధికారుల అవతారమెత్తి అంతర్జాతీయ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మదనపల్లి వన్ టౌన్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఇందుకు సంబంధించి వివరాల తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మదనపల్లికి చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా కాల్ చేసి డిజిటల్ అరెస్ట్ చేసింది. 'మీ పాన్ కార్డును వాడుకొని అకౌంట్స్ ఓపెన్ చేశారని, ఢిల్లీలో మీ పేరు మీద సిబిఐ, ఈడి కేసు నమోదయ్యిందని మీ అకౌంట్లో రూ.48 లక్షలు డబ్బులు పడ్డాయని, రిసిప్ట్ పంపి వెంటనే డబ్బు రిఫండ్ చేయాలని, లేకపోతే సిబిఐ ఇడి పోలీసులు అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకెళ్తారు' అని సైబర్ నేరగాళ్లు భయభ్రాంతులకు గురిచేసి బాధితుని దగ్గర నుంచి రూ.48 లక్షలు కాజేశారు. నిందితులు కాంబోడియా కువైట్ కేంద్రంగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. అమాయక ప్రజలకు వీడియో కాల్ చేసి 'మీ పేరుపై డ్రగ్స్ కేసులు, ఎఫ్‌ఐఆర్ ఉన్నాయని, సిఐడి, ఈడి అధికారులం' అంటూ ఈ నేరాలకు పాల్పడుతున్నారు. సాంకేతిక నిఘాధారంగా మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో వన్‌టౌన్ సిఐ మహమ్మద్ రఫీ, ఎస్‌ఐ అన్సర్‌బాషా, శివకుమార్, పోలీస్ సిబ్బంది సైబర్ సెల్ సిబ్బంది హవాలా ద్వారా డబ్బులు ఎలా బదిలీ చేస్తున్నారో సదురు విషయాన్ని గుర్తించి చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారని ఎస్‌పి తెలిపారు. నిందితుల నుండి రూ.32 లక్షలు నగదు, 25 ఎటిఎం కార్డులు, మూడు మొబైల్ ఫోన్‌లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదనంగా ఖాతాలో ఉన్న రూ.7.65 లక్షలను హోల్డ్ చేశామని తెలిపారు.

వైజాగ్ మెట్రో మంజూరు కోసం ఎటువంటి తేదీ లేదు

- కేంద్ర మంత్రి తోఖాన్ సాహు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాన భాగస్వామ్య నమూనా కింద 46.23 కిలోమీటర్ల మెట్రో రైలు ప్రాజెక్టుతో కూడిన విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు కోసం సవరించిన ప్రతిపాదనను సమర్పించిందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు తెలిపారు. వైసిపి ఎంపి గొల్ల బాబూరావు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మెట్రో రైలు విధానం-2017 ప్రకారం ఖర్చుతో కూడుకున్న మెట్రో ప్రాజెక్టులకు విస్తృతమైన అంచనా అవసరమని అన్నారు. దాని ఆమోదం ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు, వనరుల లభ్యతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అందువల్ల మంజూరు కోసం ఎటువంటి కాలక్రమాన్ని పేర్కొనలేదని చెప్పారు.

కొత్త అప్పు ఎలా!

- ఆర్థికశాఖలో చర్చ
- కేంద్రానికి లేఖ రాసేందుకు నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పరిమితికి మించి చేస్తున్న రుణాలు ఖజానాకు భారంగా మారుతున్నాయి. సగటున చేయాల్సిన రుణాల కన్నా కూడా భారీగా రుణాలు తీసుకుంటుండడంతో భవిష్యత్తు పరిస్థితి ఎలా అన్న ఆందోళన కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రు. 79,927 కోట్లు రుణంగా సేకరించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్రానికి, రిజర్వ్‌బ్యాంకుకు కూడా రాతపూర్వకంగా నివేదిక సమర్పించారు. అంటే నెలకు సగటున 6,660 కోట్లు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఇప్పటివరకు ఎనిమిది నెలల్లోనే 71,284 కోట్లు రుణంగా సేకరించారు. అంటే నెలకు సగటున తొమిది వేల కోట్ల వరకు రుణం తీసుకున్నట్టయింది. ఇంకా ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలలు మిగిలాయి.

రుణ పరిమితిలో ఇంకా 8,643 కోట్లు మాత్రమే తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అంటే సగటున నెలకు కేవలం 2,161 కోట్లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఇది కేవలం 11శాతం మాత్రమే! ఇది ప్రస్తుత ఖర్చులకు, అవసరాలకు ఎంతమాత్రం సరిపోదని అధికారులు అంటున్నారు. ప్రతినెలా జీతాలు, పింఛన్లు, సామాజిక పింఛన్లు వంటి వాటి కోసం మార్కెట్ బారోయింగ్స్‌పైనే అధికంగా ఆధాపడుతున్నారు. ప్రతి నెలా చివరి రోజుల్లో వచ్చిన పన్నుల ఆదాయాన్ని ఖర్చు చేయకుండా దాచి ఉంచడం, తొలి వారంలో మార్కెట్ బారోయింగ్స్ ద్వారా నిధులు సమీకరించుకోవడంతోనే ఈ ఖర్చులను అధిగమిస్తున్నారు.

కేంద్రం వద్దకు

కాగా రుణ పరిమితిని ముందే వినియోగించుకోవడంతో నెలకొంటున్న ఇబ్బందులపై ఆర్థికశాఖ దృష్టి సారిస్తోంది. ఇప్పటివరకు ఉన్న పరిమితిని మరికొద్దిగా పెంచాలంటూ కేంద్రాన్ని ఆశ్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. కనీసం మరో పదివేల కోట్ల వరకు అయినా పరిమితి పెంచాలని కోరేందుకు ఆర్థికశాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

రుణాలు ఇలా (రూ.కోట్లలో)

మొత్తం ఏడాది పరిమితి	79,927
8 నెలల్లోనే తీసుకున్నది	71,284
పరిమితిలో ఇంకా మిగిలినది	8,643
సగటున చేయాల్సింది	6,660
సగటున తీసుకున్నది	8,910

7న హెల్త్ సెమినార్

- ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన ఈ నెల 7న హెల్త్ సెమినార్ నిర్వహించనున్నట్లు వేదిక ప్రధాన కార్యదర్శి టి కామేశ్వరరావు వెల్లడించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జన్‌స్వాస్త్ అభియాన్ వ్యవస్థాపకులు, దేశంలో ప్రజారోగ్యంపై విశేష కృషి చేసిన అమిత్‌సేన్ గుప్తా వర్ధంతి సందర్భంగా ఆ సెమినార్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు-పరిష్కారాలు, 'అన్ని వయసుల వారిలో పెరుగుతున్న మానసిక ఆందోళన సమస్యలు-నివారణ' అనే రెండు అంశాలపై నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చికిత్స కన్నా నివారణ ముఖ్యమనే భావనతో రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. ఏ కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధుల నివారణకు శాశ్వత పరిష్కారమైన కృష్ణానది నుంచి మంచినీటి సరఫరాను పూర్తి చేసేందుకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం ఏ కొండూరు మండలంలో సికిల్ సెల్ ఎనీమియా డిసీజ్ కేసులు కూడా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో పరీక్షలు జరిపి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఐఎఎస్ పివి రమేష్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

బోయింగ్ వైడ్-బాడీ విమానాలు నడపాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరిన టిడిపి ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విజయవాడ-హైదరాబాద్, రాజమండ్రి-విజయవాడ మధ్య బోయింగ్ వైడ్-బాడీ విమానాలు నడపాలని టిడిపి ఎంపిలు కేశినేని శివనాథ్, జిఎం హరీష్ కోరారు. పార్లమెంట్‌లో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును టిడిపి ఎంపిలు సోమవారం కలిసి విజయవాడ, రాజమండ్రి విమానాశ్రయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య డొమెస్టిక్ విమాన సర్వీసులున్నప్పటికీ, వాటి టిక్కెట్ ధరలు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటున్నాయని, సీట్లు అందుబాటులో వుండటం లేదని చెప్పారు. విజయవాడ-సింగపూర్ మధ్య అంతర్జాతీయ విమాన ప్రయాణం టిక్కెట్ ధర సుమారు రూ.7 వేలకే లభిస్తుందని తెలిపారు. ఎటిఆర్ విమానాల్లో లగేజీ సామర్థ్యం తక్కువగా వుండటంతో ప్రయాణికుల లగేజీ వేరే విమానాలతో పంపిస్తున్నారన్నారు. ఇందువల్ల విదేశాలకు వెళ్లే ప్రయాణికులు సరైన సమయంలో కనెక్టివిటీ విమానాలు అందుకోలేకపోతున్నారని తెలిపారు.

విజయవాడ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండటం వల్ల ఇంటర్నేషనల్ కనెక్టివిటీ ఉండేలా ముంబయి, ఢిల్లీ విమానాశ్రయాలకు (ఎరైవల్, డిపార్చర్) విమాన సర్వీసులను నడపాలని కోరారు. గన్నవరం విమానాశ్రయంలో నేషనల్ టెర్మినల్ ప్రారంభమయ్యేలోపు నేషనల్ కనెక్టివిటి పెరిగేందుకు విజయవాడ నుంచి వారణాసి, అహ్మదాబాద్, పుణే, కొచ్చిన్, గోవా విమాన సర్వీసులు నడిపించాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఈ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

సంక్షోభంలో వ్యవసాయం

- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతులకు సాయం అందకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలో ఉందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుపాను దూసుకొస్తున్నా కనీస ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. కల్లాల్లోనే దాన్యం ఉందని, అక్కడ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని పేర్కొన్నారు. సేకరించకపోవడం వారిలో భయాందోళనలు పెరుగుతున్నాయన్నారు. ఏ పంటకూ కనీస మద్దతు ధర లేదని పేర్కొన్నారు. 1318 ధాన్యం అసలు కొనుగోలు చేయడం లేదని, ఆ విత్తనాలను మార్టేరు విత్తన పరిశోధనా కేంద్రం నుంచి ప్రభుత్వమే సరఫరా చేసిందని వివరించారు. మొంథా తుపానులో ఎంత నష్టం జరిగిందనే దానిపై లెక్కలు లేవని, 51 లక్షల టన్నుల ధాన్యం కొంటామని చెప్పి ఒక్క క్వింటా కూడా కొనలేదని తెలిపారు.

GIRIJAN COOPERATIVE CORPORATION LIMITED
East Point Colony, Visakhapatnam-17, A.P.
Ph:0891- 2796164,2581661 website:https://gcc.ap.gov.in/
Email ID:apgirijan1956@gmail.com

Rc.No.137/2025/Industries Dated:29-11-2025

INVITATION FOR EXPRESSION OF INTEREST(EOI) FOR SUPPLY OF RAW MATERIALS TO SOAP UNITS OF GCC Ltd.,

The Girijan Cooperative Corporation Ltd., (GCC),Visakhapatnam, invites Expression of Interest(EOI) from experienced firms for supply of Raw Materials, Chemicals,Oils, Perfumes and other ingredients, items to toilet Soap units at Vizianagaram and Araku valley for its rebranded wide range of toilet soaps for a period of two years (2025-26 to 2026-2027). Tender documents, other details can be obtained from the Office of Girijan Cooperative Corporation Ltd., East Point Colony, Opposite VMRDA Park, Chinna waltair, Visakhapatnam, A.P. - 530017 on all working days **(from 01-12-2025 to 22-12-2025 between 10.30 AM to 5.00 PM)** or download at https://gcc.ap.gov.in/. completed tenders in sealed cover along with EMD of multiple amounts **(by way of D.D.)**must be submitted on or before **23rd December,2025, up to 2.00 PM at GCC Office.** For details of tender document visit https://gcc.ap.gov.in/ Contact detais:**7799998696,7396759500.**

Sd/- VC & Managing Director

సంపాదకీయం

గంజాయిపై సమరం

రాష్ట్రంలో గంజాయి 'భూతం' జడలు విప్పి కరాళంగా నర్తిస్తున్నదనడానికి ప్రత్యక్ష సాక్ష్యం నెల్లూరులో శుక్రవారం పట్టపగలు యువ కళాకారుడు, సిపిఎం కార్యకర్త పెంచలయ్య దారుణ హత్య. గంజాయి, మాదక ద్రవ్యాల బారిన పడకుండా స్థానిక యువతను, ప్రజలను చైతన్యపరుస్తున్న యువ నేతను మాఫియా ముఠాలు కత్తులతో వెంబడించి చంపడం పట్ల రాష్ట్రం ఉలిక్కిపడింది. గంజాయి అక్రమ వ్యాపారాన్ని ఎదిరించి అడ్డుకోవడం సంఘ విద్రోహ ముఠాలకు కంటగింపుగా మారినందునే పెంచలయ్యను కిరాతకంగా ఒక పథకం ప్రకారం అంతమొందించారు. అఘాయిత్యానికి కారకులెవరో కొద్దిసేపట్లోనే పోలీస్ అధికారులు పూసగుచ్చినట్లు వల్లెవేశారు. ప్రధాన నిందితురాలైన మహిళా డాన్ అరవ కామాక్షి, మరికొంత మంది నిందితులను అరెస్టు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, వాటికి బానిసలు కావొద్దని ప్రభుత్వాధికార్లు, పోలీసులతో కూడా కలిసి పెంచలయ్య కొన్ని ప్రత్యేక కళారూపాల ప్రదర్శనలతో ప్రచారం చేశారు కాబట్టి నిజా నిజాలు సులభంగానే పోలీసులు తెలుసుకోగలుగుతారు.

పెంచలయ్య హత్యతోనే నెల్లూరులో గంజాయి బ్యాచ్ నేరాలు లోకానికి తెలిసిందనుకోవడానికి వీల్లేదు. గతంలో నెల్లూరులో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోడానికి ప్రయత్నించిన పోలీసులపై మాఫియా ముఠాలు ఎదురుదాడి చేసి ఉడాయించారు. మాఫియా దాడుల్లో పోలీసులు గాయపడ్డారు కూడా. పెంచలయ్య హత్య అనంతరం ఖాకీలు హంతకులను పట్టుకొనేందుకు వెళ్లగా పోలీసు కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి చేశారు. ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ వరుస ఘటనలు నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠాలు ఎంతగా పెట్రేగిపోతున్నాయో కళ్లకు కడతాయి. పెంచలయ్య హత్యోదంతంలో ప్రధాన నిందితురాలి మాఫియా సామ్రాజ్యం, మాదక ద్రవ్యాల రవాణా ఒరిస్సా నుంచి కోస్తాంధ్ర మీదుగా వయా నెల్లూరును దాటుకొని చెన్నయ్, బెంగళూరుకు విస్తరించి కొన్నేళ్లుగా నిరాటంకంగా సాగుతోందంటే పాలనలో ఉన్న అందరి అండ దండలూ పుష్కలంగా లభించాయని అర్థమవుతుంది. విషయం బయట పడింది కాబట్టి నేతల మధ్య పరస్పర ఆరోపణలు సాగుతున్నాయి. మాఫియా ముఠాలకు పార్టీలతో పని లేదు. ఎవరు అధికారంలో ఉంటే వారి మద్దతు తీసుకొని తమ దందా నడుపుతారు. సమాజానికి హానికరంగా తయారై ప్రజల మాన ప్రాణాలను హరించే ముఠాలతో తమ స్వార్థ ప్రయోజనాల కోసం అంటకాగకూడదన్న ఇంగితం పాలక పార్టీలకు, ప్రభుత్వాలకు అవసరం. గంజాయి సహా మత్తు పదార్థాలపై పోరాటం కొనసాగిస్తామన్న సిపిఎం ప్రతిన తతిమ్మా పార్టీలకు మార్గదర్శిగా నిలుస్తుంది.

మత్తు పదార్థాల రహిత రాష్ట్రం చేసేందుకు నేరస్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల్లో టిడిపి కూటమి హామీ ఇచ్చింది. కేబినెట్ సబ్‌కమిటీ భేటీలు, ఈగల్ టీంలను నెలకొల్పింది. అయినా రాష్ట్రంలో గంజాయి రవాణా ఆగలేదనడానికి రోజూ ఏదొక చోట దొరుకుతున్న గంజాయి నిల్వలే నిదర్శనం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదాయమే పరమావధిగా తెచ్చిన ఎక్సయిజ్ పాలసీలో 3,700 పైన ప్రైవేటు వైన్ షాపులు, వాటికి అనుబంధంగా తాగేందుకు పర్మిట్ రూంలు, విచ్చలవిడి బెల్ట్ షాపులు, చాలదన్నట్లు గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వగైరా. యువతను నిర్వీర్యం కావిస్తున్నాయి. కాలేజీలు, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయంటే ప్రభుత్వ నిఘా ఏమైనట్టు? నెల్లూరులోనూ నిఘా, పోలీస్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గంజాయి అంతు చూస్తామన్న కూటమి ప్రభుత్వం, హోం మంత్రి పెంచలయ్య హత్యపై కనీసం స్పందించకపోవడంతో గంజాయి కట్టడిపై కూటమి చిత్తశుద్ధి సందేహంలో పడింది. పెంచలయ్య హత్యకు కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పేద దళితుడైన పెంచలయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి. హత్యపై ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా, నెల్లూరు జిల్లాలో నిరసనలు ఎగసిపడ్డాయి. మంగళవారం నెల్లూరు జిల్లా బంద్‌లో సమాజ హితం కోరే వారందరూ పాల్గొని గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను ఖండించాలి. ప్రభుత్వం సైతం బంద్‌కు మద్దతు తెలిపి గంజాయికి వ్యతిరేకంగా ఉన్నానని సందేశమిచ్చి నేరస్తులకు హెచ్చరిక చేయాలి.

మహనీయుల మాట

వ్యక్తిగతంగా దేవునిపై నమ్మకం వున్నా మతాన్ని ఇతరులపై రుద్దే హక్కు లేదు.

- ఫ్లోరెన్స్ నైటింగేల్,
ఆధునిక నర్సింగ్ రూపకర్త.

Florence Nightingale

'పాశ్చాత్య నాగరికత' గురించి...

> **పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు గత కొన్ని శతాబ్దాలుగా తక్కిన ప్రపంచం లోని దేశాల ప్రజలమీద సాగించిన దురాగతాలు, అత్యాచారాలు తలుచుకుంటేనే మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. సామ్రాజ్యవాద దేశాల 'నాగరికత' అటువంటి వికృతమైనది. అసలు వారి ప్రవర్తన వికృత రూపాన్ని కప్పిపుచ్చడానికి 'నాగరికత' అన్న పదంతో దానికి ముసుగు వేయడమే సహించరానిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాల వలన తలెత్తిన కరువుల ఫలితంగా భారతదేశంలో కోట్లాది మంది ప్రాణాలను కోల్పోయారు. నిస్సహాయులైన భారత రైతాంగం నుండి ఆదాయాన్ని పిండుకోడానికి దురాశాపూరితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వ్యవహరించిన పర్యవసానమే ఈ కరువులు. కాంగో ప్రజలమీద బెల్జియం రాజు లియోపాల్డ్ మాటలతో చెప్పడానికి అలవికాని క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. నమీబియాలో జర్మనీ నిర్వహించిన నిర్బంధ శిబిరాల్లో ఏకంగా కొన్ని తెగలకు తెగలే కనుమరుగైనాయి.**

నవంబర్ 23న 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో ఒక కథనం వచ్చింది. 'పాశ్చాత్య నాగరికత'ను సంరక్షించుకోడానికి యూరోపియన్ దేశాలన్నీ తమ తమ దేశాల్లోకి బైటనుంచి వచ్చే వలసలను పరిమితం చేయాలని అమెరికా పిలుపునిచ్చిందన్నదే ఆ కథనం సారాంశం. ఈ 'పాశ్చాత్య నాగరికత' అనేది చాలా విలువైనదని అనుకోవడం గాని, దానిని ఎలాగైనా కాపాడాలని అనుకోవడం గాని మూడవ ప్రపంచ దేశాలలోని చాలామందికి హాస్యాస్పదంగా అనిపిస్తుంది. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు గత కొన్ని శతాబ్దాలుగా తక్కిన ప్రపంచం లోని దేశాల ప్రజలమీద సాగించిన దురాగతాలు, అత్యాచారాలు తలుచుకుంటేనే మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. సామ్రాజ్యవాద దేశాల 'నాగరికత' అటువంటి వికృతమైనది. అసలు వారి ప్రవర్తన వికృత రూపాన్ని కప్పిపుచ్చడానికి 'నాగరికత' అన్న పదంతో దానికి ముసుగు వేయడమే సహించరానిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాల వలన తలెత్తిన కరువుల ఫలితంగా భారతదేశంలో కోట్లాదిమంది ప్రాణాలను కోల్పోయారు. నిస్సహాయులైన భారత రైతాంగం నుండి ఆదాయాన్ని పిండుకోడానికి దురాశాపూరితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వ్యవహరించిన పర్యవసానమే ఈ కరువులు. కాంగో ప్రజలమీద బెల్జియం రాజు లియోపాల్డ్ మాటలతో చెప్పడానికి అలవికాని క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. నమీబియాలో జర్మనీ నిర్వహించిన నిర్బంధ శిబిరాల్లో ఏకంగా కొన్ని తెగలకు తెగలే కనుమరుగైనాయి. పాశ్చాత్య నాగరికత గురించి ఏమనుకుంటున్నారని గాంధీజీని ఒక విలేకరి అడిగితే చాలా వ్యంగ్యంగా అటువంటి 'నాగరికత' వారికి ఉండి వుంటే బాగుండేది అని ఆయన జవాబిచ్చారట.

ప్రభాత్ పట్నాయక్

అయితే ఈ క్రూరత్వాన్ని అంతటినీ పక్కన బెట్టి కాస్సేపు పశ్చిమ దేశాలు భౌతిక సంపద విషయంలో సాధించిన పురోగతి పైనే దృష్టి సారిద్దాం. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు మూడవ ప్రపంచ దేశాలను దోపిడీ చేసే విధానాలను అనుసరించడం ద్వారానే తమ పాదార్థిక అభివృద్ధిని సాధించగలిగాయి. దాని వలన ఏర్పడిన ఫలితాల ప్రభావం నుండి తప్పించుకుని ఎలాగైనా బైట పడాలని ఇప్పటికీ ఆ మూడవ ప్రపంచ దేశాల ప్రజానీకం నానా తిప్పలూ పడుతున్నారు. పశ్చిమ దేశాలు తమ స్వతంత్రమైన ప్రత్యేక శక్తి సామర్థ్యాల ద్వారా సాధించిన అభివృద్ధి అంటూ వేరే ఏదీ లేదు. మూడవ ప్రపంచ దేశాలను సర్వనాశనం చేయడం ద్వారా మాత్రమే పాశ్చాత్య దేశాల అభివృద్ధి అనేది సాధ్యపడింది. ఇప్పుడు ఆ మూడవ ప్రపంచ దేశాల నుండే ప్రజలు వలసదారుల రూపంలో ఎక్కడికైనా పోయి తలదాచుకోడానికి నానా అగచాట్లూ పడుతున్నారు. మూడవ ప్రపంచ దేశాలు తమ తమ దేశాల్లో అభివృద్ధి మార్గాన ముందుకు సాగి తద్వారా ఈ వలసలను నియంత్రించడానికి చేస్తున్న ప్రయత్నాలను సైతం దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం అవసరమైతే సైనికపరంగా కూడా జోక్యం చేసుకోడానికి తయారౌతున్నాయి.

> **పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి యావత్తూ ప్రపంచాన్ని ముక్క ముక్కలుగా చేయడం ద్వారా జరిగింది. ఈ క్రమంలో పాశ్చాత్య దేశాలు ప్రవేశపెట్టిన నూతన ఆవిష్కరణలు సైతం ఈ ముక్కచెక్కలైన చట్రం పరిధిలోనే జరిగాయి. అందుచేత పశ్చిమ పెట్టుబడిదారీ దేశాలు సుసంపన్నంగా మారడానికి, మూడవ ప్రపంచ దేశాలు అభివృద్ధికి నోచుకోకుండా కునారిల్లిపోడానికి కారణం అక్కడ ప్రవేశపెట్టిన నూతన ఆవిష్కరణలు కావు. ఇలా ప్రపంచాన్ని ముక్కచెక్కలు చేసి కొల్లగొట్టడమే కారణం.**

నేను చేస్తున్న ఈ వాదనను అతిశయోక్తులుగా పరిగణించి కొందరు కొట్టివేయవచ్చు. అటువంటివారు చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి: 'పాశ్చాత్య దేశాల్లో గణనీయమైన సాంకేతిక మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి. వాటి ద్వారా చాలా అద్భుతంగా శ్రామిక ఉత్పాదకత పెరిగింది. తద్వారా పశ్చిమ దేశాల్లో నిజవేతనాలు, నిజ ఆదాయాలు బాగా పెరిగాయి. సామ్రాజ్యవాద దేశాల్లో ఉన్నది, మూడవ ప్రపంచ దేశాల్లో కనిపించనిది ఈ కొత్త కొత్త పరిశోధనలే. ఆ సాంకేతిక పురోగతి అన్నదే పశ్చిమ దేశాలను మూడవ ప్రపంచ దేశాల కంటే భిన్నంగా నిలబెట్టింది. వాటి ఆర్థిక గమన దిశలో పూర్తి తేడా అన్నది దానివల్లే తలెత్తింది. దాని వల్లే ఆ మూడవ ప్రపంచ దేశాల నుండి వలసదారులు వేరే వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారు.'

అయితే ఇక్కడ నూతన పరిశోధనల విషయంలో రెండు అంశాలను చెప్పాలి. ఏదైనా ఒక కొత్త సరుకుకు సంబంధించిన పరిశోధనను ఉత్పత్తి రంగంలో ఉపయోగించాలంటే అటువంటి సరుకుకు సంబంధించిన మార్కెట్ విస్తరించే పరిస్థితి ఉండాలి. అందువల్లే ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్నప్పుడు కొత్త పరిశోధనలను ఉత్పత్తి రంగంలో ప్రవేశపెట్టరు. రెండవది: కొత్త ఆవిష్కరణలు వాటంతట అవే నిజవేతనాలను పెంచడానికి దోహదం చేయలేవు. అప్పటికి లేబర్ మార్కెట్‌లో కార్మికులు తగినంత సంఖ్యలో లభ్యం కాని పరిస్థితులు ఉన్నప్పుడే కొత్త ఆవిష్కరణలు నిజవేతనాల పెంపుకు తోడ్పడగలవు. మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లను సామ్రాజ్యవాదులు చేజిక్కించుకున్న కారణంగా చరిత్రలో దీర్ఘకాలం పాటు పాశ్చాత్య దేశాల ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తుందన్న అంచనాలు కొనసాగాయి. బ్రిటన్‌లో మొదలైన పారిశ్రామిక విప్లవం పారిశ్రామిక పెట్టుబడిదారీ యుగానికి నాంది పలికింది. అక్కడ యంత్రాల ద్వారా తయారైన సరుకులకు మార్కెట్‌ను కల్పించడం మూడవ ప్రపంచ దేశాల చేతివృత్తుల మార్కెట్‌ను దెబ్బ తీయడం ద్వారా మాత్రమే సాధ్యపడింది. పశ్చిమ దేశాలలో వచ్చిన కొత్త ఆవిష్కరణలకు రెండో పార్శ్వంలో మూడవ ప్రపంచ దేశాల స్థానిక మార్కెట్ల వినాశనం కనిపిస్తుంది. దానితోబాటు పెద్ద ఎత్తున అక్కడ రిజర్వు శ్రామికులు (ఉపాధి కోల్పోయినవారు) తయారయ్యారు.

సాంకేతిక పురోగతి కారణంగా నూతన ఆవిష్కరణలు ప్రవేశపెట్టిన దేశాల్లో సైతం రిజర్వు శ్రామికులు తయారయ్యారు. అయితే, పశ్చిమ యూరప్ నుండి పెద్ద సంఖ్యలో శ్రామికులు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తదితర సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోయారు. ఇలా వలసలు పోయినవారు ఆ కొత్త ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక తెగల ప్రజలను పెద్దఎత్తున ఊచకోత కోశారు. వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టారు. వారి భూములను ఆక్రమించుకుని అక్కడ సాగు చేయడం ప్రారంభించారు. ఈ భారీ వలసల కారణంగా, ఏ దేశాల్లోనైతే కొత్త ఆవిష్కరణలు ఉత్పత్తిలో ప్రవేశపెట్టారో అక్కడ లేబర్ మార్కెట్‌లో కొంతవరకు కొరత కనిపించింది. అందువలన ఒకమేరకు నిజవేతనాల్లో పెరుగుదల వచ్చింది. కొత్త ఆవిష్కరణలు ఆ ప్రత్యేక పరిస్థితుల్లో ఉత్పాదకత పెరగడానికి, అదే సమయంలో నిజవేతనాలు పెరగడానికి దారి తీశాయి.

కాని మూడవ ప్రపంచ దేశాల్లో పెరిగిన రిజర్వు శ్రామికులు యూరప్ కార్మికుల మాదిరిగా ఆ సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోవడం సాధ్యపడలేదు. వాళ్ళు ప్రధానంగా ఉష్ణ మండల ప్రదేశాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అక్కడ వేతనాల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. పైగా వలసలపై చాలా ఆంక్షలు కూడా ఉంటాయి. నేటికీ అదే పరిస్థితి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ యూరప్ దేశాల నుండి ఆ దేశాలకు పెట్టుబడిదారులు గనుక తరలివెళ్ళి అక్కడి తక్కువ వేతనాల స్థాయిని ఉపయోగించుకుని తమ వద్దనున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి ప్రపంచ మార్కెట్‌కు సరుకులను అందించివుంటే అప్పుడు పశ్చిమ దేశాలకు, మూడవ ప్రపంచ దేశాలకు మధ్య వేతనాల్లోని వ్యత్యాసాలు అంతరించి వుండేవి. కాని సమశీతోష్ణ మండల దేశాల నుండి పెట్టుబడి ఉష్ణమండల దేశాలకు ఆ విధంగా తరలిరాలేదు. కేవలం పరిశ్రమలకు కావలసిన ముడిసరుకుల ఉత్పత్తి రంగాలకు మాత్రమే వచ్చింది. ఇక ఉష్ణ మండల దేశాలలో సరుకుల ఉత్పత్తి రంగంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్థానిక పెట్టుబడిదారులు సరుకులను ఉత్పత్తి చేసినా, సమశీతోష్ణ మండల దేశాల్లో అమలులో ఉన్న అధిక దిగుమతి సుంకాల వలన ఆ సరుకులను ఎగుమతి చేయడం సాధ్యం కాలేదు. అందుచేత పాశ్చాత్య దేశాలలో నూతన ఆవిష్కరణలు కేవలం సంపన్న పెట్టుబడిదారీ దేశాలను మాత్రమే సంపన్నవంతం చేశాయి. అది కూడా తక్కిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను విడదీసి వేరుగా ఉంచడం ద్వారా మాత్రమే జరిగింది.

ఇలా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేరు వేరుగా ముక్కలు చేసి ఉంచిన పరిస్థితుల్లోనే పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాప్తి జరిగింది. సమశీతోష్ణ మండల దేశాలకు యూరప్ నుంచి వలసలు పోయిన శ్రామిక వర్గంతోబాటు యూరప్ నుండి పెట్టుబడి కూడా ఆ దేశాలకు వెళ్ళింది. అయితే ఆ పెట్టుబడి అంతా ఉష్ణమండల ప్రదేశాల్లోని వలస దేశాల నుండి కొల్లగొట్టినదే. ఆ వలస దేశాలు ఎగుమతి చేసిన ముడిసరుకుల ద్వారా పోగుబడిన విదేశీ మారకద్రవ్యాన్ని వాటికి చెల్లించకుండా స్వాధీనం చేసుకుని ఆ మిగులునే ఈ సమశీతోష్ణ మండల దేశాలకు (కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వగైరా) పెట్టుబడిగా తరలించారు.

19వ శతాబ్దంలో సుదీర్ఘ కాలం పాటు ఇలా పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణ బ్రిటన్ నుండి ముందు యూరప్ ఖండంలోని తక్కిన దేశాలకు, అక్కడి నుండి సమశీతోష్ణ మండల దేశాలైన కెనడా, అమెరికా వగైరా దేశాలకు కొనసాగింది. ఈ కాలం అంతా బ్రిటన్ తన మార్కెట్లను ఎటువంటి ఆంక్షలూ లేకుండా తెరచి వుంచింది. ఆ యా ప్రదేశాల నుండి సరుకులు బ్రిటన్ లోకి యథేచ్ఛగా రావడానికి, ఆ ప్రదేశాలకు బ్రిటన్ నుండి పెట్టుబడులు యథేచ్ఛగా పోడానికి ఇది తోడ్పడింది. ఆ క్రమంలో బ్రిటన్ నుండి జరిగిన సరుకుల ఎగుమతుల కన్నా దిగుమతులు అధికంగా ఉండి వాణిజ్యంలో లోటు భారీగా ఉండేది. అదేవిధంగా బ్రిటన్ లోకి వచ్చిన పెట్టుబడుల కన్నా బ్రిటన్ నుండి తరలి వెళ్ళిన పెట్టుబడే అధికంగా ఉండి పెట్టుబడి ఖాతాలోనూ భారీగా లోటు ఉండేది. 1910 నాటికి ఈ లోటు మొత్తం 12 కోట్ల పౌండ్ల వరకూ చేరింది. అందులో దాదాపు సగం లోటును పూడ్చడానికి బ్రిటన్ భారతదేశానికి చెల్లించవలసిన సొమ్ము (ముడిసరుకులను కొనుగోలు చేసినందువల్ల చెల్లించవలసినది) చెల్లించకుండా ఎగ్గొట్టింది.

అంతేకాక, ఇండియాలో బ్రిటన్ నుండి వచ్చిపడ్డ పారిశ్రామిక ఉత్పత్తుల కారణంగా ఇక్కడ చేతివృత్తులు నాశనం అయ్యాయి. బ్రిటన్‌కు ఇండియా ఎగుమతి చేసిన ముడిసరుకుల విలువ కన్నా ఇక్కడ చేతివృత్తులు నాశనం అయినందువలన ఇండియా నష్టపోయినది చాలా ఎక్కువ. తక్కిన యూరప్ దేశాలతోను, అమెరికా తోను ఆ నాడు బ్రిటన్‌కు ఉండిన వాణిజ్య, పెట్టుబడి ఖాతాల లోటు 9 కోట్ల 50 లక్షల పౌండ్లు. అందులో దాదాపు మూడింట రెండు వంతుల మేరకు లోటును భర్తీ చేయడానికి బ్రిటన్ ఇండియాను బలిపశువును చేసింది.

ఆ విధంగా పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి యావత్తూ ప్రపంచాన్ని ముక్క ముక్కలుగా చేయడం ద్వారా జరిగింది. ఈ క్రమంలో పాశ్చాత్య దేశాలు ప్రవేశపెట్టిన నూతన ఆవిష్కరణలు సైతం ఈ ముక్కచెక్కలైన చట్రం పరిధిలోనే జరిగాయి. అందుచేత పశ్చిమ పెట్టుబడిదారీ దేశాలు సుసంపన్నంగా మారడానికి, మూడవ ప్రపంచ దేశాలు అభివృద్ధికి నోచుకోకుండా కునారిల్లిపోడానికి కారణం అక్కడ ప్రవేశపెట్టిన నూతన ఆవిష్కరణలు కావు. ఇలా ప్రపంచాన్ని ముక్కచెక్కలు చేసి కొల్లగొట్టడమే కారణం.

జోసెఫ్ స్కంపీటర్ వంటి సిద్ధాంతవేత్తలు సైతం నూతన ఆవిష్కరణల ప్రవేశం వలన (పెట్టుబడిదారులతోబాటు) కార్మికవర్గం యావన్మందీ ప్రయోజనం పొందుతారనే చెప్పారు తప్ప కొన్ని ప్రాంతాల కార్మికులు మాత్రం ప్రయోజనం పొంది తక్కిన ప్రాంతాల కార్మికులకు ఆ ప్రయోజనాలు దక్కవని ఎక్కడా చెప్పలేదు. అందుచేత ప్రపంచంలో కొన్ని ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడి వుండడానికి, కొన్ని ప్రాంతాలు మాత్రమే అభివృద్ధి చెందడానికి మూల కారణం నూతన ఆవిష్కరణలు కావు. పనిగట్టుకుని ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలను అభివృద్ధికి దూరంగా ఉంచి వాటిని కొల్లగొట్టడమే అసలు కారణం.

ఇప్పుడు వలస పాలనకు కాలం చెల్లింది. అంతేగాక సంపన్న పెట్టుబడిదారీ దేశాల నుండి పెట్టుబడులు మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లలోకి తరలిరావడానికి సుముఖంగానే ఉన్నాయి. ఇక్కడ ముడిసరుకులు చౌకగా లభించడంతోబాటు కార్మికులు కూడా చౌకగా దొరుకుతారు. అదీ ఈ సుముఖతకు కారణం. మరి అటువంటప్పుడు మూడవ ప్రపంచ దేశాల పేదరికం తొలగిపోయివుండాలి కదా? ఎందుకు ఆ విధంగా జరగడం లేదు?

జోసెఫ్ స్కంపీటర్ వంటి వారు ప్రతిపాదించిన సిద్ధాంతాలు తప్పు అని, నూతన ఆవిష్కరణలు ప్రవేశపెట్టినంత మాత్రాన కార్మికుల నిజవేతనాలు పెరగవు అని స్పష్టంగానే కనిపిస్తోంది. మూడవ ప్రపంచ దేశాల్లో నూతన సాంకేతిక ఆవిష్కరణలను ప్రవేశ పెట్టినందువలన-అది పాశ్చాత్య దేశాల పెట్టుబడి కానీయండి లేదా దేశీయ పెట్టుబడి కానీయండి-రిజర్వు శ్రామిక సైన్యం సైజు (నిరుద్యోగుల సంఖ్య) గాని, పేదరికం గాని తగ్గవు. నిజానికి ఇప్పుడు ప్రవేశపెట్టే నూతన సాంకేతిక ఆవిష్కరణలు కార్మికుల, ఉద్యోగుల సంఖ్యను తగ్గించేవిగానే ఉన్నాయి. ఇక్కడి రిజర్వు కార్మిక సైన్యం వలసలు పోవడానికి ఏ సమశీతోష్ణ మండల ప్రదేశాలూ ఇప్పుడు లేవు.

రాబోయే రోజుల్లో పరిస్థితులు మరింత దిగజారేట్టుగానే ఉన్నాయి. ఇందుకు మొదటి కారణం ట్రంప్ విధించిన సుంకాల పెంపు. దీని వలన అమెరికా నుండి నిరుద్యోగం మూడవ ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతుంది. రెండో కారణం కృత్రిమ మేథ లేదా ఎ.ఐ. దీనిని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశ పెట్టడం వలన కూడా పరిస్థితులు మరింత దిగజారుతాయి.

(స్వేచ్ఛానుసరణ)

సందర్భం

'భోపాల్' పాఠాలు నేర్చామా?

> **భోపాల్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు లేవనే సమస్యను ఆ ప్లాంట్‌లోని కార్మిక సంఘాలు పదే పదే లేవనెత్తాయి. వాటిని యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ చివరకు బాధపడిందెవరు? కార్మికులు, భోపాల్‌లోని పేదలు మాత్రమే. ప్లాంట్ చుట్టూ ఉన్న కార్మికుల కాలనీలు, పేదల బస్తీలు, మురికివాడల్లో నివసించేవారే ఎక్కువగా నష్టపోయారు.**

భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాద ఘటన భోపాల్ దుర్ఘటన. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ కక్కిన విషంతో భోపాల్ మృత్యునగరంగా, శవాల దిబ్బగా మారి 41 ఏళ్లు గడిచిపోయాయి.

అది డిసెంబర్ 3వ తేదీ, 1984వ సంవత్సరం. ఇంకా తెల్లవారలేదు. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరం. అమెరికాకు చెందిన అతి పెద్ద బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బైడ్ కంపెనీ (యు.సి.సి) నుండి మిథేల్ ఐసోసైనేట్ (ఎం.ఐ.సి.-మిక్) అనే 41 టన్నుల విషపూరిత రసాయన వాయువు ఒక స్టోరేజ్ ట్యాంకు నుండి నిద్రిస్తున్న నగరమంతటా వ్యాపించింది. 2,500 మంది అప్పటికప్పుడే మరణించగా క్రమంగా మృతుల సంఖ్య 22 వేల మందికి చేరింది. దాదాపు అయిదు లక్షల యాభై వేల మంది ప్రజలు తీవ్రమైన ప్రభావానికి గురయ్యారు. వందలాది మంది శాశ్వతంగా వికలాంగులయ్యారు. గర్భిణీ స్త్రీలు మృత శిశువులను ప్రసవించారు. 15 వేల పశువులు, ఇంకా వేల సంఖ్యలో పక్షులు కూడా చనిపోయాయి. ఈ విష వాయువు వల్ల సంభవించే దీర్ఘకాలిక ప్రభావాల వల్ల నేటికీ ప్రజలు వైద్యం చేయించుకోవాల్సి వస్తున్నది.

ఈ దారుణమైన దుర్ఘటనకు కారకులెవరు? నిందితులను శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందా? బాధ్యులకు శిక్ష పడిందా? భోపాల్ ప్రజలకు తగిన విధంగా నష్టపరిహారం ఇచ్చారా? వారి వైద్య ఖర్చులు చెల్లించారా? ఇలాంటివి జరగకుండా అడ్డుకునేందుకు, జవాబుదారీతనం కల్పించేందుకు భారత ప్రభుత్వం గుణపాఠాలు తీసుకుందా? వీటన్నింటికీ ఒకే ఒక విషాదకరమైన సమాధానం 'లేదు' అని మాత్రమే. అణు ప్రమాదాల చరిత్రలోనే అతి పెద్దదైన ప్రమాదం జపాన్‌లోని పుకుషిమా ఘటన. దీని నుండి కూడా మన పాలకులు ఎటువంటి పాఠం నేర్చుకోలేదు. దీనికి మరో నిదర్శనం మన దేశంలో అణు ప్రమాదాలు సంభవించినప్పుడు అమెరికా కంపెనీలు బాధితులకు పరిహారం చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వటం.

భోపాల్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు లేవనే సమస్యను ఆ ప్లాంట్‌లోని కార్మిక సంఘాలు పదే పదే లేవనెత్తాయి. వాటిని యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ చివరకు బాధపడిందెవరు? కార్మికులు, భోపాల్‌లోని పేదలు మాత్రమే. ప్లాంట్ చుట్టూ ఉన్న కార్మికుల కాలనీలు, పేదల బస్తీలు, మురికివాడల్లో నివసించేవారే ఎక్కువగా నష్టపోయారు. అందువల్ల న్యాయం కోసం జరిగిన ఈ పోరాటం కూడా దోపిడీ చేసేవారికి, బహుళజాతి కంపెనీల అత్యాశకు, ప్రభుత్వంలోని వారి మద్దతుదార్లకు వ్యతిరేకంగా దోపిడీకి గురౌతున్న పేదలు జరిపిన పోరాటమే. ఈ మొత్తం విషాద గాథ కొన్ని కఠోర సత్యాలను మన ముందుంచాయి. యుపిఎ, ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వాలు అమెరికా, భారత బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ వచ్చాయనేది మొదటిది. న్యాయ వ్యవస్థలో కూడా ఈ వర్గ పక్షపాతం ప్రతిబింబించింది. ఇక రెండవ సత్యం మరణించిన 22 వేల మంది, గాయపడిన లక్షలాది మంది ప్రజలు పేదవారే.

ప్రపంచంలో ఎక్కడా ఎవరూ ఉపయోగించ వీలులేని అధ్వాన్నమైన టెక్నాలజీని భోపాల్‌లో వాడినట్లు గ్యాస్ దుర్ఘటన సంభవించే వరకూ తెలియదు. ఇప్పటికీ భోపాల్ యు.సి.సి. ప్లాంట్‌లో వేలాది టన్నుల విషపూరిత పదార్థాలున్నాయి. ఆ విషపూరిత వ్యర్థాలు తీవ్ర పరిణామాలతో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. వీటిని సక్రమంగా నిల్వ చేయకపోవడం వల్ల ప్రమాదం కొనసాగుతూనే ఉంది.

కార్పొరేట్, ఎం.ఎన్.సి. శక్తివంత కంపెనీలు తమ చేష్టల వల్ల ప్రస్తుత తరంపైనా, రేపటి తరాలపైనా చూపే ప్రభావాల గురించి పట్టించుకోవు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించే ఏక సూత్ర కార్యక్రమం వారిది. కాబట్టి మన దేశంలో పరిహారాలకు సంబంధించి కఠినమైన చట్టాలు తేవాలి. భోపాల్ దుర్ఘటనను ఎన్నడూ మరచిపోరాదు. దీనికి కారకులైనవారిని బోనులో నిలబెట్టాలి. యు.సి.సి.ని చేపట్టిన నేటి డోవ్ కెమికల్ లేదా కేంద్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు భోపాల్ ప్లాంట్‌లోని వ్యర్థ పదార్థాలను తొలగించే బాధ్యత చేపట్టాలి. నష్ట పరిహారం పెంచాలి. బాధితుల కోసం సక్రమమైన వైద్య వ్యవస్థను ఏర్పాటుచేసి వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి. ఒక స్వతంత్రమైన, స్వయంపాలకమైన అణు భద్రతా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి. భోపాల్ దుర్ఘటన నుండి గుణపాఠం నేర్చుకోకపోతే భవిష్యత్ తరాలు పాలక వర్గాలను క్షమించవు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

కవిత్వం

పెంచలయ్యకు నివాళి

ఎర్ర జెండా ఎంచి, పెంచిన
మంచి మాటల మల్లెపువ్వు!
దూబగుంట రోశమ్మ
కలల పంట కొత్త నవ్వు!
విషపు మత్తుల విచ్చు కత్తుల
దారిలోన రాలినాదా!? అది
పెంచలయ్యగ మారినాదా?
మేలుకొలిపే పూలవనము
తేటపాటల మూలధనము
సుఖము, దు:ఖము పంచుకున్న
పరిమళించే ప్రేమ గుణము
విషపు మత్తుల విచ్చు కత్తుల
దారిలోనా ఆరినాదా? అది
పెంచలయ్యగా మారినాదా?
నిబ్బరానికి నిండుకుండ
అండదండ అనాథలకు!
దాడులెన్నో జరిగినా సరే
దారి తప్పని ధీర బ్రతుకు!
విషపు మత్తుల విచ్చు కత్తుల
వేటలోన ముగిసినాదా?అది
జీవజ్వాలగ ఎగసినాదా?
ఆశయాలకు కట్టుబడిన
నీతి కాంతుల నిప్పు కణికా!
ప్రేమ చూపుల పెంచలయ్యా!
పేద సాదల పెద్ద కొడుకా!
సాగుతుంది ..ఆగిపోదు
నీ సమరం అమరమయ్యా!

- నల్లి ధర్మారావు
సెల్: 76609 67313

రోడ్లపైనే ధాన్యం ..రైతు దైన్యం

- అందుబాటులోలేని డ్రయర్ మిల్లులు
- తుపాను నేపథ్యంలో ధరల్లో కోత

రోడ్డుపైన ధాన్యం ఆరబోసిన రైతులు

ప్రజాశక్తి – కృష్ణా ప్రతినిధి

రైతులకు అండగా ఉంటామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. తాజాగా దిత్వా తుపాను ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు రైతులకు శాపంగా మారాయి. రోజువారీ యంత్రాలతో నూర్పిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించే పరిస్థితి లేకుండా పోయింది. చిరుజల్లులు పడుతుండటంతో ధాన్యం ఆరబెట్టడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తుపానును ఆసరాగా చేసుకుని కొందరు మిల్లర్లు, దళారులు ధాన్యం ధరలో కోత పెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

కృష్ణా జిల్లా మొవ్వ మండలం అవిరిపూడి నుంచి కూచిపూడి, బందరు, నిమ్మకూరు, పాలంకిపాడు వెళ్లే రోడ్లన్నీ ధాన్యంతో నిండిపోయాయి. నవంబర్ 30 నాటికి జిల్లాలో 24,137 ఎకరాల్లో వరి నూర్పిడి పూర్తి చేశారు. 1,62,068 టన్నుల ధాన్యం సేకరించారు. మరో 2,30,686.842 టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రోజువారీ నూర్పిడి సామర్థ్యానికి తగిన డ్రయర్ మిల్లులు లేకపోవడంతో నూర్పిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించే పరిస్థితి లేకుండా పోయింది. 75 డ్రయర్ మిల్లుల్లో రోజువారీ ఎనిమిది వేల టన్నుల మిల్లింగ్ చేసే సామర్థ్యం మాత్రమే ఉంది. దీంతో రోజువారీ ఏడు వేల టన్నుల ధాన్యం రోడ్లపై ఉండిపోతోంది. వాతావరణ మార్పులతో నూర్పిన ధాన్యం వెంటనే ఆరబెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, నాణ్యతలో కొర్రిపెట్టి తేమ వచ్చినా రైస్ మిల్లర్లు కొనుగోలు చేయరని రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధరలో కోత

మొవ్వ మండలం అవిరిపూడికి చెందిన కొలుసు వెంకటప్పయ్య పది ఎకరాలు కౌలుకు తీసుకుని ఎంటియు 1318 రకం వరి సాగు చేశారు. నవంబరు 24న ఐదు ఎకరాలు యంత్రాలతో నూర్పిడి చేశారు. తేమశాతం చూడకుండా పచ్చి ధాన్యం 75 కిలోల బస్తా 1475 రూపాయలకు కమిషన్ వ్యాపారికి విక్రయించారు. మరో ఐదు ఎకరాల్లో ధాన్యం ఆరబెట్టారు. రైతు సేవా కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళితే మిల్లు వద్దకు పంపారు. అయితే మాయిశ్చరు ఉందని సాకులు చెప్పి కొనడానికి నిరాకరించారు. ఈ గ్రామానికి చెందిన మరో రైతు కాట్రూరి రామకృష్ణ (నాని) ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశారు. నాలుగు ఎకరాల్లో వచ్చిన ధాన్యం దిగుబడి బస్తా 1500 రూపాయలకు విక్రయించారు. తుపాను నేపథ్యంలో మిగతా నాలుగు ఎకరాల్లోని దిగుబడిని బస్తా రూ.1300 అడుగుతున్నారు. బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన కాగిత వెంకట్రావు ఒక ఎకరంలో స్వర్ణ రకం వరి పండించారు.

అయితే మొంథా తుపాను సమయంలో అది నేలవాలింది. పండిన పంటను యంత్రాలతో నూర్పిడి చేసి రోడ్లపై ఆరబెట్టారు. ధాన్యం రంగుమారిందని చెబుతూ మిల్లర్లు కొనడానికి నిరాకరిస్తున్నారని రైతు వాపోతున్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లు యజమానితో రైతులు వాదనకు దిగడం రైతు సేవా కేంద్రాల వైఫల్యాలను ఈ ఘటనలు ఎత్తిచూపుతున్నాయి.

మరింతగా వణికించే శీతాకాలం

- ఉత్తర, మధ్య భారత రాష్ట్రాలపై అధిక ప్రభావం
- సాధారణం కంటే ఎక్కువ చలి తీవ్రత
- ఐఎండి హెచ్చరిక

న్యూఢిల్లీ : ఈ శీతాకాలంలో దేశంలోని పలు ప్రాంతాలు మరింత చలితో వణికిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 'చలిగాలి రోజులు' సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ విభాగం (ఐఎండి) సోమవారం వెల్లడించింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, తూర్పు యూపీ, ఉత్తర మధ్యప్రదేశ్, పశ్చిమ మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్‌లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండనున్నట్లు తెలిపింది. చలి గాలుల నిర్వచనాన్ని కూడా ఐఎండి స్పష్టం చేసింది. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువ, కొండ ప్రాంతాల్లో 0 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే దానిని చలిగాలి రోజుగా పరిగణిస్తారు. అలాగే సాధారణ కనిష్ట ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీలు తగ్గినా అదే కోవలోకి వస్తుంది.

డిసెంబర్–ఫిబ్రవరి మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు దేశంలోని కేంద్ర, సమీప దక్షిణ, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం నుంచి తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మినహా ప్రాంతాల్లో మాత్రం కొద్దిగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది. చలిగాలులు పెరుగుదలకు వెస్టర్న్ డిస్టర్బెన్స్ తగ్గడం ప్రధాన కారణమని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. అలాగే ప్రస్తుత సంవత్సరం లా నినా ప్రభావంలో ఉండడం కూడా చలిగాలులు పెరుగుదలకు కారణమవుతుందని వివరించారు. చలి తీవ్రత పెరుగుదల హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. మరీముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఉదయం, రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

ఆర్‌టిసి ఆస్తుల లీజు, తనఖా సరికాదు : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఆర్‌టిసికి చెందిన విలువైన భూములు, భవనాలు, డిపోలు ఇతర స్థిరాస్తులు కార్పొరేట్ కంపెనీలకు నామమాత్రపు ధరలకే లీజుకివ్వాలని, తనఖా పెట్టాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం లేఖ రాశారు. రాష్ట్రంలో 1,500 కిలోమీటర్ల రాష్ట్ర హైవేల నిర్మాణానికి రూ.22,826 కోట్లు అవసరమని, ఈ నిధుల కోసం ఆర్‌టిసి భూములు, భవనాలు, ఆస్తులు తనఖా పెట్టాలని ఆర్‌అండ్‌బి శాఖ ప్రతిపాదించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఇతర విభాగాల మాదిరిగా ఆర్‌టిసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూపాలలో పన్నులు, టోల్ ట్యాక్సులు చెల్లిస్తోందన్నారు. ఈ నిర్ణయం ఆర్‌టిసిని నిర్వీర్యం చేసేలా ఉందన్నారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality

డి. నెం. 40-9-54, మొదటి అంతస్తు, అలాస్కా కాస్కేడ్స్, పటమట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, కళానగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520010. ఫోన్: 0866-2474781 / 2481731. సెల్: 7625079119.
Email: vijayawada@canfinhomes.com. CIN:L8511OKA1987LC008699

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (నెం.54 యొక్క 2002) లోని సెక్షన్ 13(2) క్రింద

టు, **శ్రీ లోకనాథ్ యర్రంశెట్టి (దరఖాస్తుదారుడు),** నివాసం: 6-6-17, శ్రీనివాసులు వీధి, టైలర్‌పేట, చిట్టినగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001. మరియు **శ్రీమతి కనక దుర్గ యర్రంశెట్టి (సహ-దరఖాస్తుదారు),** నివాసం: 6-6-17, శ్రీనివాసులు వీధి, టైలర్‌పేట్, చిట్టినగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001.

మీరు **శ్రీ లోకనాథ్ యర్రంశెట్టి** మా శాఖ నుండి హౌసింగ్ ఋణం దిగువ ఆస్తులు తనఖా ఉంచి పొందియున్నారు. కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారికి మీలోని నెం.1 వారు **రూ.27,31,542/- (అక్షరాలా ఇరవై ఏడు లక్షల ముప్పై ఒక్క వేల ఐదు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** బకాయి అయినవారు **ది.01-12-2025** నుండి తదుపరి భవిష్య వడ్డీని కాంట్రాక్టు రేటు ప్రకారం సదరు సొమ్ముపై చెల్లించ వలసియున్నది.

తనఖా ఆస్తి యొక్క వివరములు:
కృష్ణాజిల్లా, విజయవాడ, టైలర్ పేట, శ్రీనివాసులు వీధి, బ్లాక్ నెం.1, మున్సిపల్ వార్డ్ నెం.7ఏ, డోర్ నెం.8/బి లోని డోర్ నెం.6-6-18 వద్ద ఉన్న మొత్తం 100 చదరపు గజాల స్థలంలో ఉత్తర దిశలో గల 50 చదరపు గజాల (41.80 చదరపు మీటర్లు) స్థలం మరియు దానిపై నిర్మించబడిన ఆర్.సి.సి. భవనం (గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు). **హద్దులు: తూర్పు:** కొప్పుల పెంటయ్య గారి ఆస్తి, **పడమర:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, **ఉత్తరం:** బౌరిశెట్టి సైదులు గారి ఆస్తి, **దక్షిణం:** అమలుదారుని మిగిలిన ఆస్తి.

పైన తెలిపిన సదరు యాక్ట్ ప్రకారం, ఋణగ్రహీత ఆఖరిసారి తెలిపిన చిరునామా వద్ద దిగువ సంతకందారు ద్వారా ఈ నోటీసులు అతికింపచేసినారు. మీలో నెం.1&2 లను SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద రిజిస్టర్ డిమాండ్ నోటీసు పంపడమైనది. కానీ రెండు నోటీసులు మీకు బట్వాడా కాకుండానే తిరిగి వచ్చినవి/మరణించిన వారిగా గుర్తించబడింది. కావున ఈ ప్రకటన ప్రచురించడమైనది. మీరు అనగా నెం.1&2 సదరు ఆమోదించబడిన నిబంధనలను ఉల్లంఘించి నందున మీ ఖాతాను ఎన్‌హెచ్‌బి సూచనలను అనుసరించి **తేది: 29-11-2025** న నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించడమైనది. కావున ఇందుమూలముగా మీకు తెలుపడమేమనగా పైన తెలిపిన మొత్తమును **ది.01-12-2025** నుండి ఒప్పంద రేటు ప్రకారం వడ్డీతో ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది. విఫలమైనట్లయితే సర్ఫేసి యాక్ట్ క్రింద పైన తెలిపిన సెక్యూరిటీ పై ఈ క్రింద సంతకందారు తగిన చర్యలు తీసుకోనుటకు ఉపక్రమించెదరు. ఇంకా తెలుపునది ఏమనగా ఋణగ్రహీత/హామీదారులు సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల కాలపరిమితి గురించి సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నందు గల నియమములు పరిశీలించవలసినదిగా కోరడమైనది.

తేది: 01-12-2025
ప్రదేశము: విజయవాడ
సం/- అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

క్యాన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality

బ్రాంచి ఆఫీసు: 4-1-1, గాయత్రి ప్లాజా, 1వ అంతస్తు, కొరిటిపాడు మెయిన్ రోడ్, హరిహర మహల్ థియేటర్ ప్రక్కన, గుంటూరు-522007. సెల్: 7625079146. ఫోన్ నం. 0863-2333064.
E-mail: guntur@canfinhomes.com (CIN: L85110KA1987PLC008699)

1.	1. మెసెర్స్.అను వైర్ నెట్టింగ్, ప్రొప్రైటర్. మద్దిరెడ్డి ... 644/5, మెయిన్ రోడ్డు పుత్రేల, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ ... -521227 ... Loan Account No. 923030021454207 & 923060051021357	Rs.41,17,934/-	[illegible]
2.	[illegible] Loan Account No. 923030011709724, 923060050452571 & 923060050565070	Rs. 1,77,80,600/-	[illegible]
3.	[illegible] Loan Account No. 922060052418096 & 921030029598600	Rs. 1,78,15,725/-	[illegible]
4.	[illegible] Loan Account No. 924030038999864	Rs. 1,48,80,656.62/-	[illegible]

తేది : 02.12.2025
ప్రదేశం : విజయవాడ, ఆంధ్రప్రదేశ్ సం/- అధీకృత అధికారి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

కృష్ణా నదీ జలాల వివాదంపై కెడబ్ల్యుడిటి-II తుది నివేదికను సమర్పించలేదు

- రాజ్యసభలో జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపి-తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ లేదా నియంత్రణకు సంబంధించి అదనపు నిబంధనల అంశంపై కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-II (కెడబ్ల్యుడిటి) తమకు తుది నిర్ణయాన్ని సమర్పించలేదని కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు రాజ్యసభలో ఓ ఎంపి అడిగిన ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కృష్ణా నదీజలాల విషయం కెడబ్ల్యుడిటి -II పరిధిలో ఉందన్నారు.

2025 ఆగస్టు ఒకటి నుంచి అమలులోకి వచ్చేలా మరో ఏడాది పాటు తన నిర్ణయాన్ని సమర్పించే గడువును పొడిగించాలని ట్రిబ్యునల్ అభ్యర్థించినట్లు తెలిపారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని.. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం-1956లోని సెక్షన్ 5లోని సబ్-సెక్షన్ (3) ప్రకారం, కెడబ్ల్యుడిటి-II నివేదిక నిర్ణయాన్ని సమర్పించే గడువును పొడగించినట్లు వివరించారు. 2025 ఆగస్టు ఒకటి నుంచి 2026 జులై 31 వరకు పొడిగిస్తూ ఈ ఏడాది జులై 10న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సమాధానంలో పొందుపరిచారు.

ఇక నాలుగే ప్రభుత్వ బ్యాంక్‌లు..!

- భారీ విలీనానికి కేంద్రం కసరత్తు
- ఎస్‌బిఐ, పిఎన్‌బి, బిఒబి, మరో సంస్థ మిగలొచ్చు..
- సులభంగా వాటాల విక్రయానికి మోడీ సర్కార్ యత్నం
- ఉద్యోగ అవకాశాలకు గండి..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను భారీగా కుదించాలని మోడీ సర్కార్ నిర్దేశించుకుంది. ఇందుకోసం బ్యాంక్‌ల విలీన ప్రక్రియను మరోమారు వేగవంతం చేస్తోంది. ప్రస్తుతం దేశంలో 12 ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)లు ఉన్నాయి. వీటిని నాలుగింటికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐదేళ్ల క్రితం 27 పిఎస్‌బిలు ఉండగా.. వీటిని డజన్‌కు పరిమితం చేసిన విషయం తెలిసిందే. ఆర్థిక సంవత్సరం 2026-2027 మార్చి ముగింపు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సర్కార్ కసరత్తు చేస్తోంది. అదే జరిగితే పిఎస్‌బిల్లో వాటాల విక్రయం మరింత సులభం కానుంది. అదే విధంగా ఈ రంగంలో విలీనాల ద్వారా ఉద్యోగ అవకాశాలు భారీగా పడిపోనున్నాయని బ్యాంకింగ్ సంఘాలు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదనల ప్రకారం.. 2027 మార్చి కల్లా 12 బ్యాంక్‌లను నాలుగింటికి తగ్గించాలనేది ప్రధాన యోచన. విలీనం అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి)తో పాటు కెనరా, యూనియన్ బ్యాంక్ విలీనం తర్వాత ఏర్పడే మరో బ్యాంక్ మాత్రమే మిగలనున్నాయని సమాచారం. ప్రస్తుతం ఈ అంశం ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నట్లు మనీకంట్రోల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా బ్యాంకులను తీర్చిదిద్దాలనే సాకుతో కేంద్రం విలీన ప్రయత్నాలు చేస్తోందని స్పష్టమవుతోంది. తొలుత చిన్న బ్యాంకులను కాస్త పెద్ద బ్యాంకులతో విలీనం చేసేలా సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తుందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తి తెలిపారు. మొత్తంగా పిఎస్‌బిలను నాలుగుకు తగ్గించడం ప్రణాళికలో భాగమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రణాళిక ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద ఉందన్నారు. ఆర్థిక శాఖ ఆమోదం అనంతరం క్యాబినెట్‌కు, ప్రధాని మంత్రి కార్యాలయానికి చేరనుంది.ప్రభుత్వరంగ బ్యాంకులైన కెనరా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ)లను విలీనం చేసి ఒక్క బ్యాంక్‌గా ఏర్పాటు చేసే యోచన చేసింది. ఇక ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్ కలిసి విలీనం చేసి ఎస్‌బిఐ, పిఎన్‌బి, బిఒబిలో విలీనం చేయాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఒబి), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా(బిఒఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) సంస్థలను ఎస్‌బిఐ, పిఎన్‌బి, బిఒబిల్లో విలీనం కానున్నాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు గురించి ఇప్పటి వరకు ఏ నిర్ణయమూ తీసుకోలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిని నాలుగింటిలో ఏదో ఒక దాంట్లో విలీనం చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. 2017 నుంచి 2020 కాలంలో 27 పిఎస్‌బిలను 12 బ్యాంక్‌లకు తగ్గించారు. దీంతో ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గిపోయాయి. మరోవైపు పిఎస్‌బిల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతానికి పెంచేలా ఇటీవల కొత్త ప్రతిపాదనలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎఫ్‌డిఐల పరిమితి 20 శాతంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను క్రమంగా ప్రయివేటు, విదేశీపరం చేసేలా మోడీ సర్కార్ కుట్రల్లో ఇదో భాగమని బ్యాంకింగ్ సంఘాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి.

ఆగని బిఎల్‌ఒల మరణాలు

- రాజస్తాన్‌లో గుండెపోటుతో ఒకరు మృతి
- ఎస్‌ఐఆర్ పనిఒత్తిడితోనే : కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ : దేశంలో బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్‌ఓ)ల మరణాలు ఆగడం లేదు. తాజాగా మరో బిఎల్‌ఓ గుండెపోటుతో మరణించారు. రాజస్తాన్‌లోని ధోల్పూర్‌లో 41 ఏళ్ల అనుజ్ గార్గ్ అనే ఉపాధ్యాయుడు బిఎల్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితాల ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే మార్గమధ్యలో మరణించారు. ఎస్‌ఐఆర్ యొక్క పని ఒత్తిడితోనే గార్గ్ గుండెపోటుకు గురై మరణించారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గార్గ్ సోదరి వందన మాట్లాడుతూ అర్థరాత్రి 1 గంట వరకూ కూడా తన సోదరుడు ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన పని చేశారని, తీవ్రమైన పని ఒత్తిడి కారణంగానే ఆందోళనకు గురయ్యాడని చెప్పారు. ఎస్‌ఐఆర్ పని మొదలైన నాటి నుండి అనారోగ్యానికి గురైయ్యారని తెలిపారు.. ఆదివారం ఉదయం తనను టీ అడిగాడని, కానీ తాను టీ తయారు చేసేలోపే కుప్పకూలిపోయాడని విలపిస్తూ తెలిపారు. ఆసుపత్రికి తీసుకుని వెళ్లినా రక్షించుకోలేకపోయామన్నారు. పోస్టుమార్టం ప్రక్రియ తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గార్గ్ సూపర్‌వైజర్ అయిన లోకేంద్ర కుమార్ క్షోత్రియ మీడియాతో మాట్లాడుతూ గార్గ్ మంచి పనివంతుడని చెప్పారు. గార్గ్‌కు అప్పగించిన పనిలో 80 శాతాన్ని పూర్తి చేశాడని, ఎప్పుడూ కూడా పని గురించి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అయితే గార్గ్‌తో కలిసి బిఎల్‌ఓగా పని చేస్తున్న మరొక వ్యక్తి మాట్లాడుతూ గార్గ్ పని ఒత్తిడిలో ఉన్నట్లు తనతో చెప్పినట్లు చెప్పారు. 'నేను గార్గ్‌ను 2,3 రోజుల క్రితం కలిశాను. మేమందరం ఒత్తిడిలో ఉన్నాం' అని తెలిపారు.

కస్టడీకి అల్‌ఫలా యూనివర్సిటీ వ్యవస్థాపకుడు సిద్ధిఖీ

- 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : ఉగ్రవాద సంబంధిత మనీలాండరింగ్ కేసులో అల్‌ఫలా యూనివర్శిటీ వ్యవస్థాపకుడు జావద్ అహ్మద్ సిద్ధిఖీకి ఢిల్లీ కోర్టు సోమవారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సిద్ధిఖీని నవంబర్ 19న 13రోజుల పాటు ఇడి కస్టడీకి తరలించిన సంగతి తెలిసిందే. సోమవారం ఆయనను అదనపు సెషన్స్ జడ్జి శీతల్ చౌదరి ప్రధాన్ ఎదుట హాజరుపరచగా, ఈ నెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. కస్టడీ సమయంలో సూచించిన మందులు, కళ్లజోడులను అందించాలని కోరుతూ సిద్ధిఖీ న్యాయవాది దరఖాస్తు చేసుకున్నారు. ఈ అభ్యర్థనను కోర్టు అనుమతించింది. సిద్ధిఖీ వైద్య ప్రిస్క్రిప్షన్‌ను ఇడి అధికారులు కోర్టుకు అందించారు. కోర్టు అతనికి సూచించిన చికిత్సను కొనసాగించేలా చూడాలని జైలు అధికారులను ఆదేశించింది. ఆల్‌ఫలా యూనివర్శిటీ యుజిసి గుర్తింపును తప్పుగా క్లెయిమ్ చేసిందని, ఎన్ఎఎసి అక్రిడేషన్ స్థితిని విద్యార్థులకు తప్పుగా చూపించిందని ఇడి గతంలో ఆరోపించింది. 2018 -2025 మధ్య సంస్థ రూ.415.10 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, ఆస్తుల రికార్డులతో సరిపోలినప్పటికీ.. ఆస్తుల్లో ఒకేసారి పెరుగుదల కనిపించిందని పేర్కొంది. విద్యార్థుల ఫీజులు, ప్రజల నుండి సేకరించిన నిధులను వ్యక్తిగత, ప్రైవేట్ అవసరాలకు మళ్లిస్తున్నారని, ఆల్‌ఫలా ఛారిటబుల్ ట్రస్ట్, మేనేజింగ్ ట్రస్ట్‌ల సంస్థలపై సిద్ధిఖీ నడిపిస్తున్నారని ఇడి కోర్టుకు తెలిపింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని ఆయనకు సంబంధించిన 19 ప్రదేశాల్లో జరిపిన సోదాల్లో సుమారు రూ.48లక్షల నగదు లభించిందని ఇడి అధికారులు తెలిపారు. అయితే డిసెంబర్ 15న సిద్ధిఖీ జ్యుడీషియల్ కస్టడీ ముగిసిన తర్వాత ఈ అంశం విచారణకు రానుంది.

సిఎం పినరయి విజయన్‌కు ఇడి నోటీసులు

- ఎన్నికల సమయంలోనే తెరపైకి కేసు

తిరువనంతపురం : కేరళ సిఎం పినరయి విజయన్, ఆర్థికశాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కెఐఎఫ్‌బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెఎం అబ్రహం కూడా నోటీసులు అందుకున్నారు. కెఐఎఫ్‌బి 2019 మార్చిలో మసాలా బాండ్ ద్వారా సేకరించిన నిధులతో భూమి కొనుగోలు చేశారని, విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘించారని పేర్కొంటూ ఇడి ఈ నోటీసులు జారీ చేసింది.

ఇడి నోటీసులు 'రాజకీయ ప్రేరేపితం' : థామస్ ఐజాక్

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఇడి నోటీసులు జారీ చేయడంపై రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్ ఆగ్రహించారు. ఇడి నోటీసులు రాజకీయ ప్రేరేపితమని, తప్పుడు కేసులతో మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో ఏ ఎన్నికలు జరిగినా ఇడి మసాలా బాండ్ అంశాన్ని తెరపైకి తెస్తుందన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించడంతో ఇడి మరోసారి ఈ అంశాన్ని ముందుకుతెచ్చిందన్నారు. ఆర్‌బిఐ మసాలా బాండ్లకు అనుమతులు ఇస్తుందని, ఆర్‌బిఐ ఆమోదంతోనే అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ఇడి ప్రస్తుతం తన నివేదికను న్యూఢిల్లీలోని ఇడి స్పెషల్ డైరెక్టర్ (అడ్జుడికేషన్) ఎదుట దాఖలు చేసిందని, ముఖ్యమంత్రి, తాను, అబ్రహం అన్ని వివరాలూ అందజేస్తామని తెలిపారు. ఆ నిధులతో భూమిని ఎప్పుడూ కొనుగోలు చేయలేదని, సేకరించామని చెప్పారు. న్యాయవాదులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పొలిటికల్ గేమ్ : గోవిందన్

కేరళ ముఖ్యమంత్రికి ఇడి నోటీసులు జారీ చేయడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ స్పందించారు. ఈ చర్యను 'పొలిటికల్ గేమ్'గా అభివర్ణించారు. 2020 స్థానిక సంస్థల ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఇడి నోటీసులు జారీచేసిందని అన్నారు. షోకాజ్ నోటీసులతో ఇడి ముఖ్యమంత్రికి, ఐజాక్‌కు కాదని, కేరళ ప్రజలకు సవాలు విసిరిందని అన్నారు. కెఐఎఫ్‌బి రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు నేతృత్వం వహించిందని అన్నారు. రాజకీయ దురుద్దేశంతో కేంద్రం కేసు నమోదు చేసిందని విమర్శించారు.

ఢిల్లీ వాయుకాలుష్యం కేసు నెలకు రెండు సార్లు విచారిస్తాం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్య సమస్య కేసు దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడానికి నెలలో రెండుసార్లు విచారణ చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే, పంట వ్యర్థాల దహనం సమస్య అనవసరంగా రాజకీయ సమస్యగా మారకూడదని తెలిపింది. ఢిల్లీ వాయుకాలుష్యం కేసును సోమవారం ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. వాయుకాలుష్యానికి రైతుల పంట వ్యర్థాల దహనం అంశం ఒక్కటే కారణం కాదని, ఇతర అంశాలు కూడా ఇందులో ఉన్నాయని సిజెఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ కోర్టులో లేని వ్యక్తులు (రైతులు)పై భారాన్ని మోపడం సరికాదని , పంట వ్యర్థాల దహనం అంశం గురించి వ్యాఖ్యానించాలనుకోవడం లేదని సిజెఐ తెలిపారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కొవడానికి తీసుకుంటున్న తక్షణ, దీర్ఘకాలిక చర్యల గురించి తెలియజేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎంక్యూఎం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సిపిసిబి)లను సిజెఐ ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

వక్ఫ్ వివరాల నమోదు గడువు పొడిగింపు పిటిషన్లలో జోక్యం చేసుకోలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఉమీద్ పోర్టల్‌తో 'వక్ఫ్ బై యూజర్' సహా వక్ఫ్ ఆస్తులను నమోదు చేసేందుకు గడువు పొడిగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పిటిషనర్లు సంబంధిత వక్ఫ్ ట్రిబ్యునల్‌ను సంప్రదించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. అన్ని వక్ఫ్ ఆస్తులను జియో-ట్యాగింగ్ చేసిన తర్వాత డిజిటల్ జాబితాను రూపొందించడానికి జూన్ 6న కేంద్రం యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ (ఉమీద్) పోర్టల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పోర్టల్ ఆదేశం ప్రకారం.. దేశవ్యాప్తంగా నమోదైన అన్ని వక్ఫ్ ఆస్తుల వివరాలను ఆరునెలల్లోపు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. పోర్టల్ లోపభూయిష్టంగా ఉందని, అప్‌లోడ్ చేసినపుడు వివరాలను నమోదు చేయడం లేదని పిటిషనర్లు వాదించారు. డిసెంబర్ 5తో గడువు ముగుస్తుందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోతే భారీ ఆస్తినష్టం జరుగుతుందని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. వక్ఫ్ వివరాలను అప్‌లోడ్ చేసే సమయాన్ని మరో ఆరు నెలలు పొడిగించడం ద్వారా యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1995లోని సెక్షన్ 3బి(1)ని తిరిగి రాయలేమని ధర్మాసనం పేర్కొంది. ఈ ప్రక్రియలో తిరిగి ఇబ్బందులు ఎదురైతే భవిష్యత్తులో సుప్రీంకోర్టులో దరఖాస్తు దాఖలు చేసుకునే అవకాశం ఇవ్వాలని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. దీనికి సానుకూలకంగా స్పందించిన న్యాయమూర్తి ఏదైనా సమస్య ఎదురైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు.

బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు ఐదేళ్ల జైలుశిక్ష

- అవినీతి కేసులో ఢాకా కోర్టు ఉత్తర్వులు

ఢాకా : అవినీతి ఆరోపణలపై బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఢాకా కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ప్రధాని సోదరి షేక్ రెహనాకు కూడా ఈ కేసులో ఏడేళ్ల శిక్ష విధించింది. రెహనా కుమార్తె, బ్రిటీష్ ఎంపి తులిప్ సిద్ధికికి రెండేళ్ల శిక్ష పడింది. ఢాకాలోని పూర్వాచల్ ఏరియాలో ప్రభుత్వ ప్లాట్‌ల అక్రమ కేటాయింపు కేసులో ఢాకా ప్రత్యేక న్యాయమూర్తి-4 రబీల్ ఆలం ఈ తీర్పు వెలువరించారు. గతేడాది నమోదైన ఈ కేసులో మొత్తంగా షేక్ హసీనాపై ఆమె కుటుంబ సభ్యులపై వేర్వేరుగా ఆరు కేసులను బంగ్లాదేశ్ అవినీతి నిరోధక కమిషన్ (ఎసిసి) నమోదు చేసింది. అంతకుముందు అవినీతి కేసులో హసీనాకు 21 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం ఢాకా కోర్టు మరో ఉత్తర్వు వెలువరించింది. మూడు ప్లాట్‌లకు సంబంధించిన అవినీతి, అక్రమాల కేసుల్లో ఒక్కోదానికి ఏడేళ్లు చొప్పున శిక్ష పడింది. ఆ మిగిలిన మూడు కేసుల్లో తీర్పు సోమవారం వెలువడింది. షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వజీద్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష టాకాల జరిమానా విధించారు. కుమార్తె సైమా వజీద్ పుతుల్‌కు ఐదేళ్ల శిక్ష పడింది. గతేడాది ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, అల్లర్లను అణచివేసిన కేసులో ఇక్కడి అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఇప్పటికే షేక్ హసీనాకు ఉరిశిక్ష విధించింది. ఈ కేసుల్లో వీరందరూ పరారీలో వుండడంతో వీరి తరపు న్యాయవాది ఎవరూ వాదనలు వినిపించలేదు.

డిజిటల్ అరెస్టు స్కామర్లను అణచివేయండి

- మూడు వేల కోట్లపైనే దోచేసిన మోసగాళ్లు
- ఇంటర్‌పోల్‌తో సమన్వయం చేసుకోండి
- సిబిఐకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : డిజిటల్ అరెస్టుకు పాల్పడుతున్న స్కామర్లపై, వారికి సహకరించే వారిని అణచివేసేందుకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు సిబిఐని ఆదేశించింది. సైబర్ నేరాలతో మ్యూల్ ఖాతా (అక్రమ నిధుల లావాదేవీల కోసం నేరస్తులు ఉపయోగించే ఖాతాలు) లకు గల సంబంధాల్లో బ్యాంకుల పాత్రపై అవినీతి నిరోధక దర్యాప్తు చేపట్టేందుకు అవసరమైన చర్యలు స్వేచ్ఛగా చేపట్టవచ్చని పేర్కొంది. "జరిగింది ఇక చాలు", డిజిటల్ అరెస్టు కుంభకోణాలపై సిబిఐ అత్యవసరంగా దృష్టి కేంద్రీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. బాధితుల నుండి ఇప్పటివరకు మోసగాళ్లు డిజిటల్ అరెస్టుల ద్వారా దోచుకున్న మొత్తం మూడువేల కోట్ల రూపాయలకు పైనే వుందని న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో బాధితులు ప్రధానంగా వృద్ధులే కావడం గమనార్హం. స్కామర్లను వేటాడి పట్టుకోవడానికి దేశవ్యాప్తంగా దర్యాప్తు చేపట్టాలని, నేరుగా సిబిఐ రంగంలోకి దిగాలని సుప్రీం ఆదేశించింది. ఇందుకు ముందుగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్న అంశాన్ని కూడా పక్కనబెట్టింది. కొన్ని ప్రత్యేక, అసాధారణ పరిస్థితులు తలెత్తినపుడు మాత్రమే న్యాయస్థానం నేరుగా

సిబిఐ దర్యాప్తునకు ఆదేశించగలుగుతుంది. రాష్ట్రాల్లో ఆయా పరిధుల్లో దర్యాప్తు కోసం ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 6 కింద సిబిఐకి అనుమతిని మంజూరు చేయాల్సిందిగా బీహార్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా సమగ్ర దర్యాప్తును సిబిఐ చేపట్టాలని మేం భావిస్తున్నాం." అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు కుంభకోణాల తీవ్రత, వాటి లోతైన మూలాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, సైబర్ నేరాలకు స్వర్గధామాలుగా వున్న విదేశాలను గుర్తించడానికి ఇంటర్‌పోల్‌తో సమన్వయం చేసుకుని భారత్‌లో వారి ఆటకట్టించాలని ఆదేశించింది.

ఎఐని ఉపయోగించాలి

ఈ నేరస్తులను పట్టుకోవడానికి కృత్రిమ మేథస్సు (ఎఐ)ని, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించడంపై స్పందించాల్సిందిగా కోరుతూ రిజర్వ్ బ్యాంక్‌కి నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి కార్యకలాపాలు చేపట్టడంలో సిబిఐకి అవసరమైనప్పుడు సహకరించాల్సిందిగా రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి, కేంద్ర, రాష్ట్రాల డొమైన్ నిపుణులకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. సైబర్ నేరాలకు సంబంధించిన డేటాను సేకరించడానికి, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడానికి గానూ సైబర్ క్రైమ్ సమన్వయ కేంద్రాలను ఏర్పాటుచేసి, పనులు చేపట్టాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

సిమ్ కార్డుల జారీలో నిర్లక్ష్యం

తమ ముందుంచిన రికార్డులను పరిశీలిస్తే, సిమ్ కార్డుల జారీలో టెలికం ఆపరేటర్ల ప్రమాదకరమైన, నిర్లక్ష్య ధోరణితో కూడిన, బాధ్యతారాహిత్యమైన ధోరణి వెల్లడవుతోందని చీఫ్ జస్టిస్ ఆందోళన వ్యక్తం చేశారు. సిమ్‌ల దుర్వినియోగాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఒక ప్రతిపాదనను అందజేయాల్సిందిగా టెలికం శాఖను ఆదేశించింది.

ఈ కేసులో అమికస్ క్యూరీ అయిన అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినాయి డిజిటల్ అరెస్టులు, మోసపూరితమైన పెట్టుబడులు, పార్ట్ టైమ్ ఉద్యోగాలిస్తామన్న హామీలు అంటూ సైబర్ నేరాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఇవన్నీ అమాయకులను, ముఖ్యంగా వృద్ధులను మోసం చేయడానికి ఉద్దేశించినవే. కేటగిరీ ఏదైనా వాటిని అరికట్టాల్సిన బాధ్యత, అవసరం మనపై వుందని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు.

ఎస్‌ఐఆర్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

(మొదటిపేజి తరువాయి)

మంత్రి నిర్మలా సీతారామన్ పలు బిల్లులను ప్రవేశపెట్టారు. 2025 సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. 1944 నాటి సెంట్రల్ ఎక్సైజ్ బిల్లును సవరించనున్నట్లు వెల్లడించారు. హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లును కూడా మంత్రి ప్రవేశపెట్టారు. జాతీయ భద్రత, ప్రజారోగ్యం కోసం నిధులను పెంచాలని కోరుతూ బిల్లును రూపొందించారు. మణిపూర్‌కు చెందిన జిఎస్‌టి సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఎస్‌ఐఆర్, ఢిల్లీ బాంబు పేలుళ్లు, ఢిల్లీలో కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనంటూ ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. దీంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం ప్రారంభమైన సభలో మణిపూర్‌కు చెందిన జిఎస్‌టి సవరణ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఆ తరువాత సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్

రాజ్యసభలో కూడా ప్రతిపక్షాలు ఎస్‌ఐఆర్ అంశాన్ని లేవనెత్తాయి. చర్చ జరపాలంటూ ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించడంతో వాకౌట్ చేశాయి. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రాజ్యసభ ఛైర్మన్‌గా తొలిసారి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయనను సభ స్వాగతించింది. మధ్యాహ్నం తరువాత సభ తిరిగి ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్షాలు ఎస్‌ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఎస్‌ఐఆర్ అంశంపై ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయని, చర్చకు అనుమతించాల్సిందేనని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు.

చర్చ జరగాలి : జాన్ బ్రిట్టాస్

ప్రభుత్వం అత్యవసర చర్చకు సిద్ధంగా ఉండాలని సిపిఎం రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్ స్పష్టం చేశారు. 'చర్చను ఎవరైనా నిర్వహించవచ్చు. ప్రభుత్వం దానిని నిర్ణయించాలి. కావాలనుకుంటే, ఎన్నికల సంస్కరణలపై చర్చిద్దాం. ఈ సందర్భంలోనైనా చర్చకు సిద్ధం కావాలి. సమయం నిర్ణయించాలి' అని జాన్ బ్రిట్టాస్ పేర్కొన్నారు. చర్చకు ప్రభుత్వం సిద్ధం కాకపోవడంతో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఛైర్మన్ స్థానంలో ఆశీనులైన రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికిన మల్లికార్జున ఖర్గే మాజీ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ విషయాన్ని ప్రస్తావించారు. ఆయనకు సరైన రీతిలో వీడ్కోలు దక్కలేదని, దీనిపట్ల బాధగా ఉందని వ్యాఖ్యానించారు. ధన్‌కర్ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరారు. దీనిపై మంత్రి కిరణ్‌రిజిజు స్పందిస్తూ.. ధన్‌ఖర్ రాజీనామా ఒక పవిత్ర సందర్భమని చెప్పుకొచ్చారు.

ప్రతిపక్షాలను అవమానించిన మోడీ!

సమావేశానికి ముందు మీడియాతో ప్రధాని మోడీ ప్రతిపక్షాలను అవమానించే విధంగా మాట్లాడారు. 'నాటకం ఆడాలనుకునే వారు అలా చేయవచ్చు, కానీ ఇక్కడ నాటకం అవసరం లేదు. నినాదాలు కాదు, విధానాలు గెలవాలి. ఓటమి వల్ల కలిగే భయాందోళన చర్చకు ఆధారం కాకూడదు. ప్రజల అంచనాలకు అనుగుణంగా వ్యవహరించాలి. మన బాధ్యతను నెరవేర్చాలి' అని మోడీ అన్నారు. ఆయన వ్యాఖ్యలను ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఎస్‌ఐఆర్‌తో పాటు, ప్రతిపక్ష పార్టీలు కూడా లేబర్ కోడ్స్, ఢిల్లీ పేలుళ్లు, ఢిల్లీ కాలుష్యం వంటి అంశాలపై అత్యవసర చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి.

తీవ్రమైన అంశాలపై చర్చ కోరితే డ్రామా ఎలా అవుతుంది..? : ప్రియాంకా గాంధీ

చట్టసభల్లో డ్రామాలు ఆడొద్దని, టిప్స్ ఇస్తానని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్), ఢిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని ఆమె అన్నారు. ఎన్నికల నిర్వహణలో అవకతవకలు, ఎస్‌ఐఆర్, కాలుష్యం వంటివి తీవ్రమైన అంశాలని, వాటిపై చర్చ లేకపోతే పార్లమెంట్ దేనికి..? అని ఆమె ప్రశ్నించారు. ఆయా అంశాలపై మాట్లాడటమేమీ డ్రామా కాదని, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా? అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించడానికి బదులు మరోసారి నాటకీయ ప్రసంగం చేశారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి శీతాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌కు వచ్చే క్రమంలో ఓ వీధి కుక్కను తన కారులో తీసుకురావడంపై వివాదం నెలకొంది.

రెండు దేశాల ఏర్పాటే ఏకైక మార్గం

- ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యపై పోప్ లియో
- తొలి విదేశీ పర్యటనలో కీలక వ్యాఖ్యలు

ఇస్తాంబుల్-బీరుట్ : పోప్ లియో 14 తన మొదటి విదేశీ పర్యటనలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణకు టూ స్టేట్ సొల్యూషన్ (రెండు దేశాల ఏర్పాటు) మాత్రమే న్యాయం చేయగలదని అన్నారు. ఇస్తాంబుల్ నుంచి బీరూట్‌కు వెళ్తున్న విమానంలో జర్నలిస్టులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది ఆయన పోప్‌గా ఇచ్చిన మొదటి అధికారిక 'ఎయిర్‌బోర్న్' ప్రెస్ కాన్ఫరెన్స్. టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్‌తో జరిగిన వ్యక్తిగత చర్చల్లో గాజా యుద్ధం, ఉక్రెయిన్-రష్యా వార్ గురించి మాట్లాడినట్టు పోప్ తెలిపారు. "గాజా-ఇజ్రాయిల్ సమస్యకు 'టూ స్టేట్ సొల్యూషన్' మాత్రమే మార్గం. ఇజ్రాయిల్ ఈ పరిష్కారాన్ని అంగీకరించకపోయినా అదే అక్కడి ప్రజలకు న్యాయం చేస్తుంది" అని పోప్ అన్నారు.

త్వరలో ప్రధాన సమాచార కమిషనర్ ఎంపిక

- 10న ప్రధాని నేతృత్వంలో ప్యానెల్ భేటీ
- సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ప్రధాన కమిషనర్, కమిషనర్ల ఎంపిక కోసం ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్యానెల్ సమావేశం కానుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం తెలియజేసింది. సిఐసి కమిషనర్లను, రాష్ట్ర సమాచార కమిషన్లు (ఎస్‌ఐసిఎస్)లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ విచారణకు కేంద్ర తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) కెఎం నటరాజ్ హాజరయ్యారు. ప్యానెల్ సమావేశం తేదీ నిర్ణయించారని, ఈ మేరకు ప్యానెల్ సభ్యులకు నోటీసు పంపించినట్లు కూడా తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(3) ప్రకారం ఏర్పాటు చేసిన ఈ ప్యానెల్‌కు ప్రధానమంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. ఈ ప్యానెల్‌లో ప్రతిపక్ష నాయకుడు, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ ప్యానెల్ ప్రధాన సమాచార కమిషనర్, కమిషనర్లుగా నియామకానికి పేర్లను ఎంపిక చేసి సిఫార్సు చేస్తుంది. ఈ ప్యానెల్ సమావేశం గురించి ఎఎస్‌జి వివరాలు వెల్లడించడంతో సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. అలాగే, ఎస్‌ఐసిఎస్‌ల్లోని ఖాళీల సంఖ్య గురించి, కమిషన్ల ముందు పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, ఫిర్యాదుల సంఖ్య గురించి వివరాలను సమర్పించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. సిబ్బంది శిక్షణ శాఖ (డిఒపిటి) కార్యదర్శితో సంప్రదించి మొత్తం ఖాళీల గురించి తెలియచేయాలని ఎఎస్‌జి నటరాజ్‌కు స్పష్టం చేసింది.

14.20 లక్షల మంది 'ఉపాధి' కూలీల తొలగింపు

(మొదటిపేజి తరువాయి)

స్వచ్ఛందంగా వేతనదారులు కోరితేనే.. ఇందుకు అవకాశం ఉంటుంది. ఇది కూడా 30 రోజుల ముందుగానే ముసాయిదా జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాల్సి ఉంటుంది. వేతనదారులకు ఎస్ఎంఎస్, వాయిస్ కాల్స్ ద్వారా తెలియజేయాల్సి ఉంది. ఇటువంటి చర్యలు ఏమీ లేకుండానే ఇంత పెద్ద సంఖ్యలో రాష్ట్రంలో వేతనదారులను తొలగించినట్లు నివేదిక వెల్లడించింది. కేవలం చాలా తక్కువ రోజుల్లో ఈ-కేవైసి ప్రక్రియ పూర్తి చేయడం వేతనదారుల సంఖ్య తగ్గడానికి కారణం కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ కనెక్టివిటీ సక్రమంగా లేకపోవడం, ముఖం, వేలిముద్రల ప్రామాణీకరణ వైఫల్యాలు, ఆధార్ నమోదులో పొరపాట్లు వంటి సమస్యలు ఉన్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు లిబ్ టెక్ తన నివేదికలో ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. తప్పనిసరి ఈ-కేవైసిని ఉపసంహరించుకోవడం, సామూహిక వేతనదారుల తొలగింపులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలంది. ప్రామాణిక నిర్వహణ ప్రక్రియ పాటిస్తూ.. తొలగింపబడిన వేతనదారుల జాబ్ కార్డులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో తొలగింపుల జాబితాను బహిరంగంగా ప్రదర్శించడం, తొలగింపబడిన వేతనదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించాలని కోరింది.

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం, కష్టపడి తెచ్చుకున్న అవకాశం, ఓటమి తర్వాత వచ్చే అనుభవం, గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం ఎప్పటికీ వృథా పోవు.

మీకోసం

మరుగుతున్న సాంబారులో ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

గుణపాఠం



వెంకటాపురం అనే ఊరిలో ఒక బావి దగ్గర రెండు వేప చెట్లు ఉన్నాయి. ఒకటి విశాలమైన కొమ్మలతో ఎంతో పెద్దగా ఉండేది. మరొకటి బుజ్జి బుజ్జి కొమ్మలతో కొద్దిగా చిన్నదిగా ఉండేది. పెద్ద వేప చెట్టుకు తాను పెద్దగా ఉన్నానని గర్వం ఎక్కువ. అది ఎవరినీ దగ్గరకు రానిచ్చేది కాదు. కనీసం పక్షులు గూడు కట్టుకోవడానికి వస్తే కొమ్మలను బలంగా ఊపి వాటిని భయపెట్టి వెళ్లగొట్టేది. తన నీడలో జంతువులను కూడా నిలువనిచ్చేది కాదు. పైగా చిన్న వేపచెట్టును చులకనగా చూస్తూ హేళన చేసేది. నిరంతరం అవమానిస్తూ వుండేది.

చిన్న వేప చెట్టు అలా కాదు. అందరికీ ఆశ్రయం ఇచ్చేది. దాన్ని కొమ్మల్లో పక్షులు గూళు కట్టుకున్నాయి. తేనేటిగలు తేనేపట్టును పెట్టాయి. ఎండగా ఉన్నప్పుడు ఎన్నో జంతువులు ఆ చెట్టు నీడలో సేదతీరేవి. ఇది గమనించిన పెద్ద వేప చెట్టుకు చిన్న చెట్టుపై మరింత కోపం పెరిగింది. ఎప్పుడూ సూటి పోటీ మాటలతో తిడుతుండేది.

ఇట్లా కొన్నాళ్లు గడిచిపోయిన తర్వాత ఒకరోజు ఆ ఊరి బేరగాళ్ళు చెట్లు కొట్టడానికి చెట్ల దగ్గరికి బయలుదేరారు. పక్క పక్కనే ఉన్న రెండు చెట్లను పరిశీలించారు. చిన్న చెట్టుపై కొమ్మలకు పెట్టిన గూళ్ళు, బుజ్జి బుజ్జి పక్షులు, వాటి పిల్లలు ఉన్నాయి. కొమ్ముల మీద ఆడుకుంటున్న ఉడతలు, పక్షుల కిలకిల రావాలు అన్నింటినీ చూశారు. ఆ చెట్టును కొట్టడానికి వారి మనసు ఒప్పలేదు. పక్కనే ఉన్న పెద్ద వేప చెట్టుపై వారి చూపు పడింది. పెద్ద పెద్ద కొమ్మలతో విస్తరించి ఉన్న చెట్టు దగ్గర ఇతర జీవుల జాడ కూడా వాళ్లకి కనిపించలేదు. ఇక ఏమాత్రం ఆలోచించకుండా ఆ చెట్టు కొట్టే బేరగాళ్ళు లావుగా పెద్దగా విస్తరించి ఉన్న పెద్ద వేప చెట్టును రంపంతో కోసి పడగొట్టారు. వారికి అవసరమైన మేరకు ముక్కలు ముక్కలుగా చేసి తీసుకెళ్లారు. అహంకారంతో ఎవరినీ దగ్గరకు రానీయకపోవడం వల్లే పెద్ద చెట్టుకు ఈ గుణపాఠం జరిగింది.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.

చలి -పులి

చలి చలి పోవమ్మా
చలికి మేం వణికేము
ఇప్పుడిపుడే నేను పోలేను
నిప్పుల కుంపటి వెలిగించు
వెచ్చని దుప్పటి తగిలించు
వేడి పానీయం సేవించు
వేడి ఆహారం భుజించు

– గుండాల నరేంద్రబాబు,
94932 35992.

నేను గీసిన బొమ్మ

కె. అస్మిత,
7వ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,
చింతకుంట,
కరీంనగర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సముద్రంపై ప్రేమతో...

సముద్రమంటే ఇష్టపడని పిల్లలుండరు. మరి సముద్ర రక్షణపై అవగాహన ఉన్న పిల్లలు ఎంతమంది? అని ప్రశ్న వేసుకుంటే సమాధానం దొరకదు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని ఓ చిన్నారి ప్రయత్నిస్తోంది. హైదరాబాద్‌కి చెందిన 16 ఏళ్ల ఆశ్రిత సముద్ర రక్షణపై తనలాంటి పిల్లలకి అవగాహన కల్పించేందుకు ఏకంగా రెండు స్వచ్ఛంద సంస్థలని నిర్వహిస్తోంది. 9 ఏళ్లకే డైవింగ్‌లో శిక్షణ తీసుకున్న ఆశ్రిత సముద్రంపై ఎనలేని ప్రేమని పెంచుకుంది. అయితే కలుషితమవుతున్న సముద్రాన్ని చూసి తన మనసు ఎంతో బాధపడింది. ఎంతో ఇష్టపడిన సముద్రాన్ని సంరక్షించాలంటే తనలాంటి పిల్లలని ఓ బృహత్తర కార్యక్రమంలో భాగం చేయాలని నిశ్చయించుకుంది. తన ఆలోచనకి, తల్లిదండ్రులు, టీచర్లు మద్దతు ఇచ్చారు. అలా ఆశ్రిత తన ప్రయాణం ప్రారంభించింది..

అండమాన్ హేవ్‌లాక్ ఐలాండ్‌లో డైవింగ్ చేసినప్పుడు ఆశ్రితకి 9 ఏళ్లు. ఆ తరువాత తన డైవింగ్ జర్నీ ఆపలేదు. సముద్రం లోతుల్లోకి వెళుతున్న కొద్దీ ఎంతో సంభ్రమాశ్చర్యాలకి లోనైన ఆశ్రిత అక్కడ పేరుకుపోతున్న చెత్తా చెదారాన్ని చూసింది. ఆ కాలుష్యాన్ని కట్టడి చేయాలని 'స్టెమ్' ప్రోగ్రామ్‌లో భాగంగా 'స్టెమిక్', 'భువియం' సంస్థలని నెలకొల్పింది. అప్పుడు తన వయసు 13 ఏళ్లు. అప్పటి నుండి ఇప్పటివరకు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూళ్లల్లో సముద్ర రక్షణకై వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. కథలు, కళాకృతుల ద్వారా పిల్లల్లో అవగాహన కల్పిస్తోంది. వాతావరణ మార్పులు, ప్రకృతి పరిరక్షణపై కూడా వర్క్‌షాపు పనిచేస్తోంది. తన ప్రయాణం గురించి ఆశ్రిత ఏమంటుందంటే..

'సైన్స్, పర్యావరణంపై పిల్లల్లో ఎప్పుడూ ఆసక్తి కలిగించాలి. డైవింగ్, పరిశోధన, విద్యలో నాకు అర్థమైన విషయాలని నాలాంటి పిల్లలకి చెప్పడం ద్వారా వారు కూడా ఈ జ్ఞానాన్ని పొందుతారు. ఆ అవగాహన మా భవిష్యత్తుకి ఎంతో ఉపయోగం' అంటున్న ఆశ్రిత ఇప్పటివరకు 200కి పైగా వర్క్‌షాపులు నిర్వహించింది. 'పాఠశాల విద్యలో పర్యావరణ పాఠ్యాంశాలు తప్పకుండా ఉండాల'ని గట్టిగా చెప్పే ఆశ్రిత ప్రముఖ సామాజిక విద్యావేత్త మలాలా యూసఫ్‌జైని స్ఫూర్తిగా తీసుకుంది. 'భారతీయ అభ్యసన విధానంలో పర్యావరణ పాఠాలు ఉండేలా సంస్కరణలు చేయాల'ని అంటోంది. డైవింగ్‌లో శిక్షణ తీసుకున్న ఆశ్రిత, అక్రమ లోతైన సముద్ర మైనింగ్‌ని గుర్తించడానికి, సముద్ర పర్యావరణ వ్యవస్థలని పర్యవేక్షించడానికి నీటి అడుగున అమర్చే నమూనా డ్రోన్ నిర్మాణాన్ని రూపొందించింది. భవిష్యత్తులో థర్మోన్యూక్లియర్ ఇంజనీర్, శాస్త్రవేత్త కావాలన్న ఆశయంతో ఉన్న ఆశ్రిత తన ఈడు పిల్లలకి ఇలా చెబుతోంది. 'కలలు కనండి.. వాటిని నిజం చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేయండి'.

ఉసిరితో ఉపయోగాలెన్నో...

విటమిన్ 'సి' అధికంగా లభించే వాటిల్లో ఉసిరి ముందుంటుంది. ఇది శరీరానికి అందడం వల్ల రకరకాల ఇన్‌ఫెక్షన్లు దూరంగా ఉంటాయి. తరచూ రక్తహీనతకు గురయ్యేవారు ఉసిరికి ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.

- ఈ కాలంలో గొంతు నొప్పి, మంట వంటివి ఎదురవుతాయి. అవి దూరం చేసుకోవాలంటే ఉసిరి రసంలో కాస్త అల్లం రసం కలిపి రోజుకి మూడుసార్లు తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్లు వంటివి త్వరగా తగ్గుతాయి.
- హృద్రోగాలతో, గుండెజబ్బులతో బాధపడేవారికి ఉసిరి చాలా మేలు చేస్తుంది. మంచి కొలెస్ట్రాల్ శాతాన్ని పెంచి చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. గుండెకు రక్త ప్రసరణ సక్రమంగా అందేలా చేస్తుంది. నిత్యం ఉసిరిని తీసుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది.
- ఉసిరిని ప్రతిరోజు తీసుకోవడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. ఎక్కువ సమయం నడిచినా, కొన్నిసార్లు అలసటగా అనిపిస్తుంది. అలాంటప్పుడు ఒక్క ఉసిరి కాయను దవడన పెట్టుకుని చప్పరించడం వల్ల అలసట అనిపించదు.
- మధుమేహం ఉన్నవారు ఉసిరి తీసుకోవడం చాలా మంచిది. ఇందులోని పాలీఫినోల్ రక్తంలో చక్కెర శాతాన్ని అదుపు చేసి, ఇన్సులిన్‌ను క్రమబద్ధీకరిస్తుంది.
- ఉసిరిలో పీచు, నీటి శాతం ఎక్కువ. దీన్ని తీసుకుంటే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. గ్యాస్ సంబంధిత సమస్యలు ఇబ్బంది పెట్టవు. ఇందులో యాంటి ఆక్సిడెంట్లు అధికం. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని వ్యర్థాలను కూడా ఉసిరిలోని పోషకాలు బయటకు పంపిస్తాయి.

దంత సంరక్షణ కోసం ...

కొంతమందిలో దంతాలు పసుపు పచ్చగా ఉంటాయి. ఇలాంటి వారు ఈ సింపుల్ ఇంటి చిట్కాల పాటిస్తే, పళ్ళపై ఉన్న పసుపుదనం తొలగిపోయి తెల్లగా, కాంతివంతంగా మెరుస్తాయి.

కమలా తొక్కలు : పళ్ళపై ఉన్న గార తొలగిపోవడానికి ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు తాజా కమలా తొక్కలతో పళ్ళపై రుద్దాలి. ఆ తరువాత శుభ్రంగా నీటితో పుక్కిలించడం వలన పళ్ళపై ఉన్న పసుపుదనం తొలగిపోతుంది. ఒకవేళ కమలా తొక్కలు తాజాగా లేకపోతే ముందుగానే వీటిని పొడిగా చేసుకుని రోజుకొకసారి వాడటం వలన పళ్ళు తెల్లగా అవుతాయి.

బేకింగ్ సోడా : టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను బౌల్‌లోకి తీసుకుని, అందులో రెండు స్పూన్ల నిమ్మరసం కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని టూత్‌పేస్ట్‌తో గానీ, బ్రష్‌పై వేసుకుని గానీ తోముకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి. ఇలా వారానికి ఒకటి లేదా రెండుసార్లు చేస్తే చాలు. ఫలితం కనిపిస్తుంది.

నిమ్మరసంతో... : స్పూన్ నిమ్మరసంలో కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పళ్ళపై రాసుకుని కొన్ని నిముషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత మంచి నీటితో పుక్కిలించడం వలన పచ్చని పళ్ళు తెల్లగా, అందంగా వస్తాయి. రోజుకి ఒకటి, రెండుసార్లు రెండు వారాల పాటు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

తులసి ఆకులు : కొన్ని తులసి ఆకులను ఎండబెట్టి పొడిగా చేసుకోవాలి. బ్రష్ లేదా చేతివేలితో తులసి పొడిని పచ్చని పళ్ళపై రాసుకుని నీటితో బాగా పుక్కిలించడం వలన పళ్ళపై ఉన్న గార తొలగిపోతుంది.

లవంగాలు : లవంగాలు తీసుకుని మెత్తగా పొడిగా చేసుకోవాలి. చిటికెడు లవంగాల పొడిలో కాస్త నిమ్మరసం కలిపి పేస్ట్‌గా అయ్యేలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పళ్ళు తోముకున్నట్లుగా బ్రష్‌తో లేదా చేతివేలితో తోముకుని చల్లని నీటితో పుక్కిలించాలి. ఇది వాడేటప్పుడు కాస్త మంటగా ఉన్నా కూడా ఫలితం ఉంటుంది.

వివాహబంధంలోకి సమంత-రాజ్ నిడమోరు

సమంత, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడమోరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూర్‌లోని ఇషా యోగా సెంటర్‌లో వీరు వివాహం చేసుకున్నారు. సోమవారం ఉదయం నిశ్చితార్థం, ఆ వెంటనే జరిగిన పెళ్లి వేడుకకు దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ఈ వార్తని సమంత ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. పెళ్లి ఫొటోలను కూడా షేర్ చేశారు.

గ్లోబల్ బ్రాండ్‌గా తెలుగు సినిమాలు

కందుల దుర్గేష్

'దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతాం. ఏపీలో సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరిస్తాం. భారత దేశ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తాం.కలిసి పనిచేసి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నూతన అధ్యాయం సృష్టిద్దాం. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక ఫిల్మ్ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్ సౌకర్యాలను నిర్మించే వెంచర్లకు ఏపీ ప్రభుత్వం తరపున సంపూర్ణమైన మద్దతు ఇస్తాం. ప్రతిభకు పెద్దపీట వేస్తూ త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తాం. హిందీ తర్వాత భారతదేశంలో తెలుగు సినీ పరిశ్రమ రెండో అతిపెద్దదిగా నిలిచింది. ఇది జాతీయ చలనచిత్ర పరిశ్రమకు దాదాపు 20 శాతం వాటాను అందిస్తోంది. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ, పుష్ప సిరీస్‌లు, సలార్, ఓజీ' వంటి ప్రపంచ స్థాయి సినిమాలు కథాకథనం, విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణ నాణ్యతలో అద్భుతంగా ఉండి బాక్సాఫీస్ కలెక్షన్లలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేసి తెలుగు సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయి. తెలుగు సినిమాను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చాయి. తమిళనాడు తర్వాత అత్యధికంగా ఏపీలో 1,103 స్క్రీన్లు ఉన్నాయి. ఈ రంగానికి మా ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది' అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ముంబైలో సోమ, మంగళవారాల్లో జరుగుతున్న సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025'లో ఇన్వెస్టర్లతో ఆయన మాట్లాడారు. ఫిల్మ్, టూరిజం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

'యుఫోరియా' టీజర్ విడుదల

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'యుఫోరియా' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. ఈ సినిమాలో భూమిక, గౌతమ్ మేనన్, నాజర్, సారా అర్జున్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాళ భైరవ సంగీతం అందిస్తున్నారు. యువత చెడు అలవాట్లకు బానిసలై ఎలా చెడిపోతున్నారు? వీళ్ల వల్ల సమాజంలో ఎలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయి అనే కాన్సెప్ట్ ఆధారంగా ఈ చిత్రం తీసినట్లు తెలుస్తోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ వచ్చే ఏడాది ఫిబ్రవరి 6న థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

వచ్చే ఏడాది ఆరు సినిమాలు సిద్ధం చేస్తున్నాం

'ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి. వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షుటింగ్ జరుగుతోంది' అని నిర్మాత దిల్‌రాజు వెల్లడించారు. అని తెలిపారు. 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (గోవా)-2025లో పాల్గొన్న ఆయన మీడియాతో పై విధంగా మాట్లాడారు. బలగం చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు యెల్దండి ఇప్పుడు తన రెండో చిత్రంగా 'ఎల్లమ్మ'ను ప్రకటించారు. కథానాయకులుగా శర్వానంద్, నాని పేర్లు అనుకున్నా అనుకోని పరిస్థితుల్లో వారు ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. సాయిపల్లవి, కీర్తి సురేష్‌ల పరిస్థితి కూడా అలాంటిదే. తాజాగా జరిగిన పరిణామాల్లో నితిన్ కథానాయకుడిగా ఎంపిక చేసినట్లుగా సమాచారం. తాను నటించేందుకు సిద్ధమేననీ, షుటింగ్ కూడా త్వరలోనే ప్రారంభమవుతుందని నితిన్ ఇటీవల స్వయంగా ప్రకటించారు. కథానాయిక పేరు కూడా త్వరలోనే ప్రకటిస్తామని దిల్‌రాజు ప్రకటించారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

'ఆర్‌ఎక్స్‌ఫ్లోర్ మూవీస్' ప్రారంభం

'ఆర్ ఎక్స్‌ఫ్లోర్ మూవీస్' పేరుతో నిర్మాత అతీకూర్ రెహమాన్ కొత్త చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించారు. 'ఈ బ్యానర్‌లో ప్రేక్షకులకు వినోదంతో పాటు సందేశాన్ని కూడా అందించే చిత్రాలు తెరకెక్కనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'చైల్డ్ ట్రాఫికింగ్, డ్రగ్స్, ఉమెన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా ఫ్రాడ్స్ ఇలా ఎన్నో సమస్యల్లో చిక్కుకుని యువత దారి తప్పుతున్నారు. ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి యువతను అప్రమత్తం చేసేలా, వారిని ఇలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కోకుండా చేసేలా కాన్సెప్ట్‌లు ఎంచుకుని మా బ్యానర్‌లో సినిమాలు నిర్మించాలనుకుంటున్నాం. మేము నిర్మించనున్న మొదటి సినిమాకు కథ సిద్ధమైంది. ఈ సినిమా కోసం త్వరలో ఆడిషన్స్ నిర్వహించబోతున్నాం. టాలెంట్ ఉన్న వారిని ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా మా సినిమాలో నటించేందుకు అవకాశం కల్పిస్తాం' అని అన్నారు.

రికార్డుల రారాజు కోహ్లి

అత్యధిక శతకాలతో టాప్‌లోకి ● సచిన్ టెండూల్కర్ రికార్డు బ్రేక్

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో శతకంతో మెరిసిన టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లి పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో 52 శతకాలు కొట్టిన తొలి ప్లేయర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ క్రమంలో టెస్టుల్లో అత్యధిక సెంచరీలు కొట్టిన సచిన్ టెండూల్కర్(51 సెంచరీలు) రికార్డును విరాట్ అధిగమించాడు. అలాగే మూడు ఫార్మాట్‌లలో కలిపి కోహ్లి కొట్టిన శతకాల సంఖ్య కూడా 83కు చేరింది. ఇందులో వన్డేల్లో 52, టెస్టుల్లో 30, టి20ల్లో ఒకటి ఉన్నాయి. ఓవరాల్‌గా క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన రికార్డు (వంద సెంచరీలు) సచిన్ టెండూల్కర్ పేరిట పదిలంగానే ఉంది. సచిన్ టెండూల్కర్ వన్డేల్లో 49, టెస్టుల్లో 51 సెంచరీలు చేశాడు.

పలు రికార్డులు నమోదు

రాంచీ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో ఇరుజట్లు కలిపి ఒక వన్డేలో అత్యధిక పరుగులు చేయడం, రోహిత్ శర్మ.. వన్డే ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టడం.. ఇలా పలు రికార్డులు భారతజట్టు నెలకొల్పింది.. అవేమిటంటే..

681: భారత్-దక్షిణాఫ్రికా జట్లు కలిసి ఒక వన్డేలో ఇన్ని పరుగులు నమోదు చేయడం ఇదే తొలిసారి. 2015లో వాంఖడే వేదికగా జరిగిన వన్డేలో ఇరు జట్లు 662పరుగులు చేశాయి. దక్షిణాఫ్రికా 438పరుగులు చేస్తే.. ఇండియా224 పరుగులకే పరిమితమైంది.

6: దక్షిణాఫ్రికాపై విరాట్ కోహ్లి కొట్టిన శతకాల సంఖ్య. ఆ జట్టుపై మరే ఏ ఒక్క బ్యాటరూ ఇన్ని శతకాలు కొట్టిన దాఖలాలు లేవు. అంతకు ముందు సఫారీ జట్టుపై సచిన్ టెండూల్కర్(భారత్), డేవిడ్ వార్నర్(ఆస్ట్రేలియా) ఐదేసి సెంచరీలు కొట్టారు.

352: రోహిత్ శర్మ(57; 51బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు) దక్షిణాఫ్రికాపై అర్ధశతకంతో మెరిసాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు షాహిన్ అఫ్రిది(పాకిస్తాన్; 351సిక్సర్లు) పేరిట ఉంది.

16: దక్షిణాఫ్రికాపై ఒక వన్డేలో ఇండియా అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును నెలకొల్పింది. తొలి వన్డేలో టీమిండియా 16 సిక్సర్లు కొట్టగా.. 2010లో గ్వాలియర్‌లో దక్షిణాఫ్రికాపై కేవలం 12 సిక్సర్లు మాత్రమే నమోదయ్యాయి.

173: రాంచీ పిచ్‌పై 173పరుగుల సగటు సాధించిన తొలి బ్యాటర్‌గా విరాట్ నిలిచాడు. అలాగే ఈ పిచ్‌పై 500కు పైగా పరుగులు తొలి బ్యాటర్‌గా కోహ్లి(519పరుగులు) నిలిచాడు. రాంచీ వేదికపై 5ఇన్నింగ్స్‌లో కోహ్లి ఇందులో మూడు సెంచరీలు, ఒక అర్ధసెంచరీ కొట్టాడు ఇది ఒక రికార్డు. అంతకుముందు ఈ రికార్డు హాషీం ఆమ్లా(దక్షిణాఫ్రికా) 120పరుగుల సగటుతో ఉంది. సెంచూరియన్ వేదికపై ఆమ్లా మూడు శతకాలతో మెరిసాడు.

11: 300కు పైగా పరుగుల ఛేదనలో దక్షిణాఫ్రికా 11 పరుగులకే 3వికెట్లు కోల్పోయి.. భారీ లక్ష్యాన్ని చేరువ కావడం వన్డేల్లో ఇది రెండోసారి మాత్రమే. 2006లో ఆస్ట్రేలియా జట్టు 10 పరుగులకే 3వికెట్లు కోల్పోయి శ్రీలంకపై 368పరుగుల భారీస్కోర్ చేసింది. రాంచీలో దక్షిణాఫ్రికా 11 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి 321 పరుగులు చేసింది.

1: వన్డేల్లో దక్షిణాఫ్రికా టాప్, మిడిలార్డర్ నలుగురు బ్యాటర్లు కలిసి 35కంటే తక్కువ పరుగులు కొట్టడం ఇదే తొలిసారి. ఓవరాల్‌గా ఐదుగురు బ్యాటర్లు 35కంటే తక్కువ పరుగులు చేశారు. (మార్‌క్రమ్(7), రికెల్టన్(0), డికాక్(0), సుబ్రయాన్(17), బర్గర్(17) పరుగులకే ఔటయ్యారు.

10: సఫారీలపై ఒక భారత స్పిన్నర్ 10 వికెట్లు తీయడం ఇది రెండోసారి మాత్రమే. అంతకు ముందు అనీల్ కుంబ్లే(10) తొలుత సాధించగా.. తాజాగా కుల్దీప్(10వికెట్లు) సమం చేశాడు. పేసర్లలో మహ్మద్ షమీ(16వికెట్లు), అజిత్ అగార్కర్ (12వికెట్లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

392: క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో రోహిత్ శర్మ-విరాట్ కోహ్లి కలిసి ఆడిన మ్యాచ్‌ల సంఖ్య. అంతకుముందు ఈ రికార్డు సచిన్-ద్రావిడ్(391 మ్యాచ్‌లు పేరిట ఉండగా.. సఫారీలపై తొలి వన్డేలో రోహిత్-కోహ్లి ఆ రికార్డును బ్రేక్ చేశాడు.

7: వన్డేల్లో దక్షిణాఫ్రికాపై ఏడు సిక్సర్లు కొట్టి విరాట్ కోహ్లి రెండో స్థానంలో నిలిచాడు. అంతకు ముందు 2011లో యూసుఫ్ పఠాన్(8సిక్సర్లు) అగ్రస్థానంలో నిలువగా.. 2022లో ఇషాన్ కిషన్(7సిక్సర్లు) రెండో స్థానంలో ఉన్నారు.

- స్పోర్ట్స్ కరస్పాండెంట్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం-ప్రజల పక్షం
దినపత్రికలో ఉద్యోగ అవకాశాలు
జర్నలిజం కాలేజీలో శిక్షణ
▶ సబ్ ఎడిటర్లు
▶ రిపోర్టర్లు
▶ వెబ్ జర్నలిస్టులు
తెలుగులో వ్రాయగలిగి ఉండాలి
వర్తమాన, సామాజిక, ఆర్థిక రాజకీయాలపై అవగాహన
జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉంటే..
బయోడేటాను మెయిల్ చేయగలరు
కనీస విద్యార్హత : డిగ్రీ చదివినవారు
సంప్రదించాల్సిన అడ్రస్ : ప్రజాశక్తి భవనం,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా
prajasakti.hr@gmail.com
ఫోన్ : 94940 98968, www.prajasakti.com
చివరి తేదీ 2025 డిసెంబర్ 10

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68